ఆదివారం ప్రత్యేకం



లైబ్రరీ బస్సు

ఆర్టీసీ బస్సును కదిలే లైబ్రరీగా మార్చేశాడు ఒక చిన్న ఉద్యోగి. తిరుపతి- మదనపల్లె మధ్య నడుస్తున్న ఆ బస్సు ఎక్కగానే పుస్తకప్రయాణానికి స్వాగతం అనే బోర్డు ఆహ్వానిస్తుంది. మద్యపానం గురించి, పుస్తక పఠనం గురించి మంచి మాటలు బస్సులో కనిపిస్తాయి. లోపలికి అడుగుపెట్టగానే వేలాడుతున్న గుడ్డ ర్యాక్‌లో రకరకాల పుస్తకాలుంటాయి. ప్రయాణికులు చదువుకుని దిగేటప్పుడు అందులో పెట్టేయవచ్చు. ఈ బస్సులో తిరుపతి- తిరుమల ప్రత్యేకత, మదనపల్లి విశేషాలు కూడా చార్టుల్లో ముద్రించి వేలాడదీశారు. ఈ మార్పులకు కారణం ఆ బస్సు డ్రైవర్ గుంపు రఘుకుమార్ అనే యువకుడు. తెలుగుభాషాభిమాని. సాహిత్యాభిలాషి. మదనపల్లి- తిరుపతి నడుమ ప్రయాణానికి మూడు గంటల సమయం పడుతుంది. బస్సు ఎక్కగానే ప్రయాణికులంతా సెల్‌ఫోన్ చేతుల్లోకి తీసుకుని



ఎవరి ప్రపంచంలో వారు మునిగిపోతున్నారు.కనీసం పక్కవారితో కూడా మాటలు కలపడం లేదు. ఈ పరిస్థితిని చూసిన రఘుకుమార్ బస్సులోకి పుస్తకాలు చేర్చారు.ఆసక్తి ఉన్నవారిని చదవమని చెబుతుంటారు. ప్రయాణికుల్లో నిదానంగా పుస్తకాలు చేతికి తీసుకునేవారి సంఖ్య పెరిగింది. ఇందువల్ల మొబైల్స్ జేబుకే పరిమితం అవుతున్నాయి. చరిత్ర, వర్తమాన సమాచారం, కథలు, మనోవిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై 30 పుస్తకాలు ఎప్పుడూ ఈ బస్సులో అందుబాటులో ఉంటాయి. ఇవన్నీ ఆయన సొంత ఖర్చుతోనే ఏర్పాటుచేయడం విశేషం. ఈ లైబ్రరీ బస్సు గురించి తెలిసి తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రతినిధులు సాకం నాగరాజ, వాకా ప్రసాద్ శుక్రవారం దీనిని సందర్శించారు. డ్రైవర్ రఘుకుమార్‌ను అభినందించారు. కొన్ని పుస్తకాలను, కొత్త పుస్తకాల కోసం కొంత నగదును అందజేశారు. వీరిని చూసి ఒక ప్రయాణికురాలు కూడా పుస్తకాలు కొనమని కొంత నగదు ఇచ్చారు.

- తిరుపతి (కల్చరల్)





తిరుపతి జిల్లాకు నాలుగవ కలెక్టర్‌గా వచ్చారు డాక్టర్ సంజామల వెంకటేశ్వర్. ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఇడమకల్లు ఆయన పుట్టిన ఊరు. 2017లో ట్రైనీ కలెక్టర్‌గా అనంతపురం జిల్లాలో పనిచేశారు. పాడేరు సబ్ కలెక్టర్‌గా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా చేశారు. కొవిడ్ సమయంలో విశాఖ జిల్లా నోడల్ అధికారిగా సేవలందించారు. హౌసింగ్ జేసీగా చిత్తూరుకు వచ్చిన వెంకటేశ్వర్ ఆ తర్వాత జాయింట్ కలెక్టర్‌గా ఏడాదిన్నర పాటు కొనసాగారు. వైద్య శాఖలో సెకండరీ హెల్త్ విభాగం డైరెక్టర్‌గా, వైద్యారోగ్య శాఖ కమిషనర్‌గా చేస్తూ కలెక్టర్‌గా తిరుపతికి వచ్చారు. గ్రామీణ ప్రాంతం నుంచి ఐఏఎస్ దాకా తన ప్రయాణాన్నీ.. కొత్త బాధ్యతల్లో తన ప్రాధాన్యాలనూ ఆంధ్రజ్యోతికి వివరించారు.

ఇంటర్వ్యూ



డాక్టర్ సంజామల వెంకటేశ్వర్

పుట్టిన తేది: ఏప్రిల్ 4, 1989

కుటుంబం: తల్లిదండ్రులు వెంకటయ్య, కాశమ్మ. భార్య సించన. కుమార్తె హన్విక. అన్న, ముగ్గురు అక్కలు.

చదువు: ప్రైమరీ, హైస్కూలు గుంటూరు లయోలా పబ్లిక్ స్కూలులో. ఇంటర్ వైజాగ్ శ్రీ చైతన్యలో. మెడిసిన్ వైజాగ్ ఆంధ్రా మెడికల్ కాలేజీలో.

చిన్ననాటి కోరిక:

"ప్రకాశం జిల్లా కొమరోలు మండలం ఇడమకల్లు మా స్వస్థలం. నాన్న వెంకటయ్య మిలిటరీలో 13 ఏళ్ళు పనిచేసి రిటైరయ్యారు. అమ్మ కాశమ్మ గృహిణి. నాన్న మిలిటరీ నుంచీ వచ్చాక వ్యవసాయం చేసేవారు. పంచాయతీ సర్పంచుగా, కొమరోలు జడ్పీటీసీ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఆయన వెంట అప్పుడప్పుడూ ఒంగోలు కలెక్టరేట్‌కు వెళ్ళేవాడిని. ఎప్పటికైనా కలెక్టర్ కావాలనే కోరిక అప్పుడు నాటుకున్నదే.విశాఖ ఆంధ్రా మెడికల్ కళాశాలలో మెడిసిన్ చేస్తున్నప్పుడు ఎదురుగానే కలెక్టరేట్ వుండేది. కింగ్ జార్జి ఆస్పత్రికి అప్పట్లో విశాఖ కలెక్టర్ శ్యామలరావు (ప్రస్తుత టీటీడీ ఈవో) తనిఖీలకు వచ్చేవారు. ఆ సమయంలో అధికారులు, ఉద్యోగుల హడావిడి చూశాక కలెక్టర్ కావాలన్న చిన్నప్పటి కోరిక మరింత బలపడింది. అందుకే మెడిసిన్ పూర్తి కాగానే హైదరాబాదు, ఢిల్లీలలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నా. కల సాకారం చేసుకున్నా. కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకుని తిరుపతికి వచ్చా. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల వెంకటేశ్వరస్వామి కొలువైన జిల్లాకు కలెక్టర్‌గా రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నా."

"2012లో హైదరాబాదులో ఆరు నెలలు, తర్వాత ఢిల్లీలో ఆరు నెలలు కోచింగ్ తీసుకున్నా. 2013లో తొలి ప్రయత్నంలో 806వ ర్యాంకు వచ్చింది. ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీసుకు ఎంపిక కావడంతో అందులో చేరా. ఓవైపు శిక్షణ తీసుకుంటూనే 2014లో రెండవ సారి మళ్ళీ సివిల్స్ రాస్తే 889వ ర్యాంకు వచ్చింది. ఆ ర్యాంకుతో ఐడీఈఎస్ (రక్షణ శాఖ)లో అవకాశం వచ్చినా చేరలేదు. 2015లో మూడోసారి మరింత బాగా ప్రిపేర్ అయి సివిల్స్ రాసి 216వ ర్యాంకుతో ఐఏఎస్ సాధించా."

కొత్త కలెక్టర్ ప్రాధాన్యాలు

పరిశ్రమలు పర్యాటకం

తొలి ప్రాధాన్యం

జిల్లాకు జాతీయ రహదారులు, రైల్వేలు, విమానయానపరంగా ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ బాగుంది. దానికి తోడు జిల్లాలో ఏడు మున్సిపాలిటీలున్నాయి. శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లు, ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు రెండు, అలాగే ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులు వున్నాయి. వీటిలో అనేక పరిశ్రమలు వున్నాయి. చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్, వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ రెండూ జిల్లా పరిధిలో వుండడం వరంగా భావించాలి. ఈ రెండు కారిడార్లకు, అలాగే చెన్నై నగరానికీ చేరువగా వున్నందువల్ల పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలున్నాయి. వస్తు ఉత్పత్తి పరిశ్రమలతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది. అప్పుడే జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. దానికనుగుణంగా జిల్లా ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవడానికి తొలి ప్రాధాన్యత ఇస్తా.

విద్యా, వైద్య కేంద్రంగా మరింత ప్రచారం

రాష్ట్రంలో విజయవాడ, గుంటూరు తర్వాత తిరుపతే విద్యారంగానికి ప్రధాన కేంద్రంగా వుంది. విజయవాడ, గుంటూరుల్లో లేని అరుదైన, జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇక్కడ వున్నాయి. ఐఐటీ, ఐసర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ, స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, ఐఐడీటీ వంటివి వున్నాయి. వీటిలో కలినరీ, హోటల్ మేనేజ్‌మెంట్ సంస్థల గురించి పెద్దగా ప్రచారం లేదు. సాధారణ వర్శిటీలతో పాటు వేదిక్ వర్శిటీ, హార్టికల్చర్ వర్శిటీ, సంస్కృత విద్యాపీఠం వంటివీ ఉన్నాయి. వైద్యపరంగానూ రుయా, స్విమ్స్, బర్డ్, ఆయుర్వేదిక్ వంటి ఉన్నతస్థాయి ఆస్పత్రులు, పలు మెడికల్ కళాశాలలున్నా ప్రాచుర్యం లేదు. వైద్య అవసరాలకు, వైద్య విద్యార్జనకు ఇక్కడికి దేశవ్యాప్తంగా ప్రజలు, విద్యార్థులు వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది. ఆ దిశగా ప్రయత్నిస్తా.

హెరిటేజ్-ఎకో టూరిజం

తిరుపతి, తిరుమల వచ్చే యాత్రికులు ప్రధానంగా శ్రీవారి దర్శనం చేసుకుని వెనుదిరుగుతున్నారు. ఒక రాత్రి మాత్రమే జిల్లాలో గడిపి రెండవ రోజు తిరుగుప్రయాణమవుతున్నారు. తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న వారిలో అతి తక్కువమంది మాత్రమే తిరుచానూరు, శ్రీకాళహస్తి వెళుతున్నారు. కొందరు కాణిపాకం వెళ్తున్నారు.ఈ సంఖ్య గణనీయంగా పెరగాల్సి వుంది. తిరుమల వచ్చిన యాత్రికులు కనీసం రెండు రాత్రిళ్ళు జిల్లాలో బస చేసేలా చేయాలి. తిరుపతిలో కపిలతీర్థం, కోదండరామాలయం,గోవిందరాజస్వామి ఆలయం, గంగమ్మ గుడి వంటి ముఖ్య ఆలయాలు, రీజనల్ సైన్స్ సెంటర్, జూ పార్కు వంటి పిల్లలను ఆకర్షించే దర్శనీయ స్థలాలున్నాయి. చుట్టుపక్కల నారాయణవనం, నాగలాపురం, గుడిమల్లం, అప్పలాయగుంట, తొండమనాడు, సురుటుపల్లి వంటి పేరున్న ఆలయాలున్నాయి. ఇక పర్యావరణపరంగా చూస్తే జిల్లాలో తలకోన మొదలుకుని ఉబ్బలమడుగు, కైలాసకోన, సదాశివకోనతో పాటు శేషాచల అడవుల్లో అనేక జలపాతాలు, అటవీ ప్రాంతాలున్నాయి. చంద్రగిరి కోట గురించి చెప్పక్కర్లేదు. సముద్రతీరం వున్నందున బీచ్ టూరిజానికి అనుకూలం. వీటన్నింటినీ కలుపుకుని హెరిటేజ్-ఎకో టూరిజం ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తే జిల్లాకు ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. ఈ రంగాలపై ప్రధానంగా దృష్టి సారిస్తా. ప్రకృతి అంటే నాకు చాలా ఇష్టం. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో నారాయణవనం చుట్టుపక్కల అనేక జలపాతాలకు ట్రెక్కింగ్ చేశా. జిల్లా ప్రజలకు తెలియని జలపాతాలు కూడా చాలా వున్నాయి. వీటి అభివృద్ధి కోసం ఎకో టూరిజం ప్రాజెక్టులు రూపొందించాల్సిన అవసరముంది.

ఆక్వా అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లాలో అటు ఆక్వా ఉత్పత్తులపరంగానూ, ఇటు టూరిజంపరంగానూ అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయి. గూడూరు నియోజకవర్గ పరిధిలో రొయ్యల చెరువులు అధికంగా వున్నాయి. 2014-19 నడుమ అప్పటి సీఎం చంద్రబాబు ఆక్వా రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో దేశంలోనే అత్యధికంగా ఏపీ 27 శాతం అభివృద్ధిని అప్పట్లో నమోదు చేసింది. ఇపుడు చంద్రబాబు సీఎంగా వున్నందున జిల్లాలో చేపలు, రొయ్యలు వంటి ఆక్వా ఉత్పత్తుల అభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యత ఇవ్వనున్నారు. దీనిపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సవిరమైన నివేదిక, ప్రణాళికలు అందజేస్తా.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేలకు దిగనున్న ఇసుక ధరలు



జిల్లాలో ఐదు స్టాక్ పాయింట్లు ● రేపటినుంచి పంపిణీ ● రోజుకు ఒకరికి 20 టన్నులు మాత్రమే!

తిరుపతి(కలెక్టరేట్)/తిరుపతి, జూలై6(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళుగా నింగికెక్కిన ఇసుక ధరలు రేపటి నుంచీ నేలకు దిగనున్నాయి. ఎన్నికల ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు ఇసుకను ఉచితంగా అందజేస్తామన్న హామీకి అనుగుణంగా కొత్త ప్రభుత్వం ఇసుకపై నూతన విధానాన్ని రూపొందించింది. ప్రాథమికంగా స్టాక్ పాయింట్ల నుంచీ ఇసుకను వినియోగదారులకు అందించేందుకు విధివిధానాలను ప్రకటించింది.స్టాక్ పాయింట్ నిర్వహణకు, లోడింగ్‌కు అయ్యే ఖర్చు వంటి వాటికి మాత్రమే వినియోగదారులు ప్రభుత్వానికి డబ్బు చెల్లించాలని స్పష్టం చేసింది. ఇది నామమాత్రపు ధరేనని,రవాణా ఖర్చు మాత్రం వినియోగదారులు భరించాల్సి వుంటుందని ప్రకటించింది. మొత్తం మీద గత ఐదేళ్ళుగా రూ. 5 వేల నుంచీ రూ. 6 వేల వరకూ పలికిన ఇసుక లోడు ధర ఇపుడు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లాకు సంబంధించిన ఇసుక లభ్యత, స్టాక్ పాయింట్ల వివరాలు, నిర్ణయించిన ధరల వివరాలను కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎస్‌కు వివరించారు.

ఐదు స్టాక్ పాయింట్లలో ధరలిలా...

జిల్లాలో సోమవారం నుంచీ ఐదు స్టాక్ పాయింట్లు జనానికి అందుబాటులోకి రానున్నాయి. శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రెండు , పిచ్చాటూరు మండలం ఏకే బీడు వద్ద ఒకటి, దొరవారిసత్రం మండలం మామిళ్ళపాడులో ఒకటి, వెంకటగిరి మండలం మొదులుగుంటలో ఒకటి చొప్పున ఐదు స్టాక్ పాయింట్లను జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీటిని సోమవారం నుంచీ తెరవనున్నారు. ఉదయం 6 నుంచీ సాయంత్రం 6 దాకా స్టాక్ పాయింట్లలో ఇసుక బట్వాడా జరుగుతుంది.సుబ్బానాయుడు కండ్రిగ, ఏకే బీడుల్లోని మూడు స్టాక్‌పాయింట్లలో టన్ను ఇసుకకు రూ. 200 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. మామిళ్ళపాడు వద్ద రూ. 465 చొప్పున, మొదులుగుంట స్టాక్ పాయింట్‌లో టన్నుకు రూ. 590 వంతున చెల్లించాలి.ఆధార్ కార్డు ప్రాతిపదికగా రోజుకు ఒక వ్యక్తికి గరిష్ఠంగా 20 టన్నుల ఇసుక మాత్రమే స్టాక్ పాయింట్‌లో కేటాయించనున్నారు. అంటే ట్రాక్టర్ లోడ్ ప్రాతిపదిక తీసుకుంటే రోజుకు ఐదు లోడ్‌ల ఇసుక మాత్రమే ఒకరు పొందడానికి వీలవుతుంది.ఇసుక ధరల చెల్లింపునకు ప్రభుత్వం డీఎంజీ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. వెబ్‌సైట్‌లోని క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి డిజిటల్ పేమెంట్(ఫోన్‌పే, పేటీఎం, గూగుల్‌పే) ద్వారా చెల్లించి స్టాక్ పాయింట్ వద్ద రశీదు చూపిస్తే ముందు వచ్చిన వారికి ముందుగా అన్న ప్రాతిపదికన ఇసుక కేటాయింపులు జరుగుతాయి.ఇసుక ద్వారా వచ్చిన ఆదాయం కూడా స్థానిక సంస్థలకే జమ కానుంది.

అందుబాటులో 2లక్షల మెట్రిక్ టన్నులు

జిల్లాలో సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. నాయుడుపేట పరిధిలోని కూచివాడలో సుమారు 5లక్షల క్యూబిక్ మీటర్ల టన్నుల ఇసుక తవ్వకాలకు మైనింగ్ అధికారులు రీచ్‌లను గుర్తించారు. పర్యావరణ అనుమతులు రాగానే ప్రజావసరాలకు కావాల్సిన ఇసుక అందుబాటులోకి రానుంది.

గ్రామ ప్రజల అవసరాలకు ఉచితమే... యంత్రాలకు నో ఎంట్రీ

గ్రామ పంచాయతీల పరిధిలోని వాగులు వంకల్లో ఇసుక తీత, లోడింగ్ వంటి వాటికి యంత్రాలు వాడకూడదని ప్రభుత్వం సూచించింది. గ్రామప్రజల అవసరాల నిమిత్తం ఇసుకను ఉచితంగా వినియోగించుకోవచ్చు. అయితే ఇసుక వ్యాపారులు ఎవరైనాసరే అక్రమంగా ఇసుక తరలించినా డంపింగ్ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని అధికారులు హెచ్చరించారు. దీనిపై పోలీసులు,సెబ్, రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాయి.



మాజీ ఎమ్మెల్యే భూమనతో సురేష్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

లెక్క తప్పిన లెక్కలయ్యోరు!

నిబంధనలకు విరుద్ధంగా రెండు వేతనాలు, డిప్యుటేషన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6:ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో ఓ లెక్కల మాస్టారు లెక్క తప్పారు.టైం స్కేల్ ప్రాతిపదికన ఉపాధ్యాయుడిగా చేరిన సురేష్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీలో చక్రం తిప్పారు.తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వద్ద పీఏగా, తరువాత ఓఎస్డీగా పనిచేశారు.ఇటు క్యాంపస్ స్కూల్ టీచర్‌గా వేతనం పొందుతూనే పీఏగా కొంతకాలం, ఓఎస్డీగా కొంతకాలం వేతనాలు పొందినట్టు సమాచారం. ఆర్థిక ప్రయోజనాలతో పాటు యూనివర్సిటీ పాలన కూడా సురేష్‌రెడ్డి కనుసన్నల్లోనే సాగింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మళ్ళీ సురేష్‌రెడ్డి మాస్టారు స్థానానికి వచ్చేశారు. కొందరికి పదవులు, ఉద్యోగాలు ఆశచూపి డబ్బులు కాజేశాడనే విమర్శలను ఆయన ఎదుర్కొంటున్నారు. 2019 ఎన్నికల్లో కరుణాకర రెడ్డికి పోస్టల్ బ్యాలెట్ల విషయంలో సురేష్‌రెడ్డి కీలకపాత్ర పోషించినట్టు ప్రచారం జరిగింది. పీలేరు ప్రాంతానికి చెందిన సురేష్‌రెడ్డి ఎస్వీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీధర్ రెడ్డికి బావ మరిది. రిజిస్ట్రార్ పదవి ప్రొఫెసర్ శ్రీధర్‌రెడ్డికి దక్కేందుకు అప్పట్లో సురేష్‌రెడ్డి అంతా తానై పని చేసినట్టు ప్రచారం సాగింది. సురేష్‌రెడ్డి సోదరి ప్రొఫెసర్ సునీత ప్రస్తుతం యూనివర్సిటీ జువాలజీ విభాగంలో అధ్యాపకురాలిగా ఉన్నారు.2024లో అధ్యాపకులకు ఇచ్చిన కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) ఇంటర్వ్యూల్లో కనీసం జాయినింగ్ రిపోర్టు కూడా ఇవ్వకుండానే ప్రొఫెసర్ సునీత అమెరికాలో ఉన్నట్టు ఆరోపణలు వినిపించాయి.ఒక ఉపాధ్యాయుడు ప్రజాప్రతినిధులకు పీఏగా, పీఎస్‌గా, ఓఎస్డీగా వెళ్ళడానికి న్యాయపరమైన అభ్యంతరాలున్నట్టు యూనివర్సిటీలో చర్చ నడిచింది. అయితే, సీఎం జగన్‌కు సమీప బంధువు, అప్పట్లో రెక్టార్‌గా ఉన్న ప్రొఫెసర్ సుందరవల్లి అండతో నిబంధనలను అధిగమించి అప్పటి ఎమ్మెల్యే వద్ద పీఏగా వెళ్ళేందుకు అనుమతి తీసుకున్నట్టు చెబుతున్నారు.ఉన్నతాధికారుల అనుమతితో డిప్యుటేషన్‌పై వెళ్ళినప్పుడు తిరిగి చేరేటప్పుడు కూడా అధికారిక అనుమతి తీసుకోవలసి ఉంటుందని, అయితే అదేం లేకుండానే మ్యాథ్స్ టీచర్‌గా సురేష్‌రెడ్డి తిరిగి క్యాంపస్ స్కూల్లో విధుల్లో చేరినట్టు సమాచారం.క్యాంపస్ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహించకనే ఎలా వేతనం పొందుతారనే ప్రశ్న తెరమీదకు వస్తోంది.

టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి నియమితులయ్యారు.ప్రస్తుతం ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న మల్లికార్జున పరకామణి ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ఆయన్ను పరకామణికి పరిమితం చేశారు.రిటైర్డ్ అధికారిని ఎస్టేట్ ఆఫీసర్ స్థానంలో కొనసాగిస్తున్నారనే విమర్శలొచ్చిన నేపథ్యంలో ఆయన స్థానంలో తిరుపతిలోని శ్వేతలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని నియమించారు. తిరుమల హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి స్థానంలో తిరుపతిలో అదనపు హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న సునీల్‌కుమార్‌ను నియమించారు. ఇటీవల తిరుమలలో పారిశుధ్య వైఫల్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. తరచూ పరిశుభ్రతపై విమర్శలు వస్తున్న క్రమంలో హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి కూడా బదిలీకోసం వినతిపత్రాన్ని అందజేశారని, ఈ క్రమంలో ఈవో ఆమోదం తెలపడంతో సునీల్‌కుమార్‌ను నియమించినట్టు సమాచారం.

వైభవంగా వారాహి దేవికి తిరుమంజనం



రామచంద్రాపురం, జూలై 6: రాయలచెరువుకట్ట శ్రీశక్తిపీఠంలో వెలసిన వారాహి దేవికి వైభవంగా తిరుమంజనం నిర్వహించారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ఆది వారాహిదేవిగా శనివారం అలంకరించారు. అనంతరం పీఠంలో విశేషపూజలు నిర్వహించి అమ్మవారికి నివేదన సమర్పించారు. మధ్యాహ్నం వారాహి హోమం వేదమంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఊంజల్‌సేవ జరిగింది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చెత్త తొలగింపు





మంగళం, జూలై 6: మంగళం పరిధిలోని ఆర్టీవో కార్యాలయం నుంచి బీటీఆర్ కాలనీకి వెళ్లే ప్రధానమార్గంలో వెంకటేశ్వరకాలనీ వద్ద పేరుకుపోయిన చెత్తను శనివారం పంచాయతీ అధికారులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చల్లించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన చెత్తను తొలగించరా అనే వార్తకు స్పందించిన పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టారు.

ముగ్గురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

మంగళం, జూలై 6: ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి, 53 ఎర్ర చందనం దుంగలు, బైక్‌ని స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ పి.నరేష్ బృందం శుక్రవారం రాత్రి కూంబింగ్ చేపట్టగా, శనివారం తెల్లవారుజామున నాగసానిపల్లి రేంజిలోని పోతభక్తుని బావి ప్రాంతంలో కొందరు వ్యక్తులు బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని చుట్టుముట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా దాచి ఉంచిన 53 దుంగలను చూపారు. స్మగ్లర్లను అదుపులోకి తీసుకుని, దుంగలను, బైక్‌ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డవారిలో.. కడప జిల్లా ఖాజీపేట మండలానికి చెందిన దాడిబోయిన గురుప్రసాద్(37), మైదకూరు మండలానికిచెందిన తమ్మిశెట్టి వెంకటేష్(24), బత్తల శివ(25)గా గుర్తించారు. పరారైన మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర విభజనకు తండ్రీ కొడుకులే కారణం : చింతా మోహన్



తిరుపతి(వైద్యం), జూలై 6: రాష్ట్ర విభజన జరగడానికి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిలే కారణమని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లోనే జగన్ ఉండి ఉంటే రాష్ట్ర విభజన జరిగేది కాదని వ్యాఖ్యానించారు. కేంద్రం దగ్గర రాష్ట్ర ప్రయోజనాలను ఏనాడూ జగన్ ప్రస్తావించలేదని విమర్శించారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు దుగరాజపట్నం ఓడరేవును అభివృద్ధి చేయాలని కేంద్రాన్ని కోరడం అభినందనీయమన్నారు. అలిపిరికి సమీపంలో కాంగ్రెస్ హయాంలో క్రికెట్ మైదానం కోసం ప్రత్యేక నిధులు తీసుకొచ్చి పునాది రాళ్లు కూడా వేశామని చెప్పారు. కూటమి ప్రభుత్వం తిరుపతిలో క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అంతకుముందు ఆయన టీటీడీ పరిపాలనా భవనం ముందు కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వీఐపీ బ్రేక్ దర్శనాల వివరాలు రోజూ ప్రకటించాలని.. టీటీడీ, ప్రభుత్వ ఉద్యోగులకు, అర్హులైన నిరుపేదలకు జూపార్కు వద్ద ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి, నేతలు వెంకటేష్ గౌడ్, నాగరాజు, శాంతి, రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పలువురు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6: కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వెంకటేశ్వర్‌ను శనివారం కలెక్టరేట్‌లో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, సెట్ ఏఎస్పీ రాజేంద్ర, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎంపీ చింతామోహన్, అలాగే ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్‌తోపాటు పలువురు అధికారులు కలెక్టర్‌ని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

అన్నమాచార్యలో గ్రాడ్యుయేషన్ డే



తిరుపతి(విద్య), జూలై 6: అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (ఏఐటీఎస్)లో రెండో గ్రాడ్యుయేషన్ డే శనివారం జరిగింది. తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యన్నారాయణ, ఐఐఎస్ఈఆర్ రిజిస్ట్రార్ కె.విజయమోహన్ పిళ్లై ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం 503 మంది బీటెక్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేసి, అభినందించారు. ప్రొఫెసర్ వి.వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించాలి

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ప్రతి నెలా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య అధ్యక్షుడు తోటకూర కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు నజ్మ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసి, సన్మానించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బీఎల్‌వోల గౌరవవేతనాన్ని మంజూరు చేయాలని కోరారు. గ్రేడ్5 పంచాయతీ కార్యదర్శులకు పూర్తిస్థాయిలో డీడీవో అధికారాలను కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకటకిషోర్, విద్యాసాగర్, నాగమోహన్, పవన్‌కుమార్, సురేష్, లోకేష్, హరిబాబు, ఉదయ్, సుధీర్, దేవేంద్ర, సాయి, హర్షవర్ధన్, రెడ్డెమ్మ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు యూపీఎస్సీ పరీక్షలు

- **జిల్లాలో 10 కేంద్రాలు, హాజరు కానున్న 5,273మంది అభ్యర్థులు**

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6: జిల్లాలో ఆదివారం జరగనున్న యూపీఎస్సీ ఈపీఎఫ్‌వో, ఈఎస్ఐసీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈపీఎఫ్‌వోలోని పర్సనల్ అసిస్టెంట్ పోస్టులకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మూడు సెంటర్లలో.. ఈఎస్ఐసీలోని నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు మధ్యాహ్నం 2.30నుంచి 4.30గంటల వరకు ఏడు సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 5,273మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రిజిస్టర్ పోస్టు'కు నిరీక్షించాల్సిందేనా?

తిరుపతి తపాలా కార్యాలయంలో ఇదీ పరిస్థితి



తిరుపతి(ఆటోనగర్), జూలై 6: తిరుపతి తపాలా కార్యాలయంలో రిజిస్టర్ పోస్టు చేయడానికి వెళితే గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే కౌంటర్ పనిచేస్తుండటంతో క్యూలైన్‌లో బారులు తీరాల్సి వస్తోందంటున్నారు. మరో కౌంటర్‌ను ఓపెన్ చేయమని అక్కడున్న ఉద్యోగులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. పైగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోతున్నారు. శనివారం మధ్యాహ్నం కూడా రిజిస్టర్ పోస్టు చేయడానికి జనం బారులు తీరి కనిపించారు. ఈ విషయమై ఏఎస్పీ వసంత మాట్లాడుతూ.. ప్రజలకు త్వరగా సేవలందించడానికే కార్యాలయంలో ఐదు కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వీటిని తమ పర్యవేక్షకులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారన్నారు. సోమవారం ఈ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం



ప్రణయ్(ఫైల్)

ఓజిలి, జూలై 6 : ఓజిలి మండలం పాపిరెడ్డికండ్రిగ సమీపంలో ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి ప్రణయ్(18)మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన ప్రణయ్ నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ప్రణయ్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నడిచి వస్తుండగా ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని హుటాహుటిన నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ప్రణయ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రగిరి

తిరుచ్చిపై సీతారాములు



చంద్రగిరి, జూలై 6: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చంద్రగిరిలో వెలసిన కోదండరామాలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా ఉదయం 11 గంటలకు సీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లను ఆలయ ఆవరణలో ప్రత్యేక వేదికపై కొలువు దీర్చి, సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.







వ్యాక్సిన్ వేయించడానికి తీసుకొచ్చిన వివిధ జాతుల శునకాలు

బాక్సర్.. గోల్డెన్ రిట్రైవర్

అరుదైన శునకజాతుల సందడి

ఘనంగా జూనోసిస్ డే

పామరేనియన్, లాబ్రడార్, గోల్డెన్ రిట్రైవర్, బాక్సర్, డాబర్‌మెన్, జర్మన్‌షెపర్డ్, పగ్‌బ్రీడ్, గ్రేట్‌డేన్.. వంటి అరుదైన శునక జాతులతో శనివారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, తాతయ్యగుంటలోని పట్టణ పశువైద్యశాల ప్రాంగణాలు సందడిగా మారాయి. జూనోసిస్‌డే సందర్భంగా వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్, పట్టణ పశువైద్యశాలలో పెంపుడు జంతువులకు(శునకాలు, పిల్లులు) ప్రీ వ్యాక్సినేషన్ (రేబీస్ వ్యాధి నిరోధక టీకాలు) కార్యక్రమాన్ని నిర్వహించారు. దాంతో పలువురు యజమానులు తమ పెంపుడు జంతువులను తీసుకొచ్చి వ్యాక్సినేషన్ చేయించారు. మొత్తం 450 జంతువులకు వ్యాక్సినేషన్ చేసినట్లు వీసీసీ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు వివరించారు. వెటర్నరీ వర్సిటీలో నిర్వహించిన జూనోసిస్‌డేకి ముఖ్యఅతిథిగా హాజరైన డీన్ కె.వీరబ్రహ్మయ్య, ఏడీ పి.జగపతిరామయ్య హాజరయ్యారు. ప్రొఫెసర్లు ధనలక్ష్మి, రఘునాథ్, భారతి, వివిధ విభాగాల హెడ్లు, పట్టణ పశు వైద్యశాల వైద్యులు ప్రభావతి, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి రూరల్



వ్యాక్సిన్ వేస్తున్న డాక్టర్ వైకుంఠరావు, పక్కన డీన్ వీరబ్రహ్మయ్య, ఏడీ జగపతిరామయ్య తదితరులు

మండల పరిషత్ నిధులతో బియ్యం, పప్పులు కొంటారా ?

వైసీపీ సర్కారు హయాంలో అవకతవకలపై టీడీపీ మండిపాటు



వస్తువులు కొన్న బిల్లులు చూపుతున్న టీడీపీ నాయకులు

భాకరాపేట, జూలై 6: తుడా నుంచి చిన్నగొట్టిగల్లు మండలానికి మంజూరైన నిధులు గోల్‌మాల్ జరిగినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ ఆరోపించారు. శనివారం చిన్నగొట్టిగల్లులో ఆయన మీడియాతో మాట్లాడుతూ తుడా నుంచి మండల పరిషత్‌కు మంజూరైన నిధుల నుంచి నిత్యావసర వస్తువులు, బియ్యం, పప్పులు, ఆయిల్, చిల్లీ పౌడర్, ఆవాలు, మెంతుల పేరుతో రూ.40 లక్షలు డ్రా చేశారని, ఈ నిధులతో కొనుగోలు చేసిన వస్తువులు ఎక్కడ ఉపయోగించారో ప్రజలకు బహిర్గతం చేయాలన్నారు. కార్యాలయ ఫర్నీచర్ పేరుతో రూ.5 లక్షలు డ్రా చేసినట్లు బిల్లులు ఉన్నాయని, వాటిలో కొంత సామగ్రి ఆఫీసులో ఉండగా.. మిగిలినది ఎక్కడ ఉందో తెలియడం లేదన్నారు. ఇదంతా వైసీపీ మండల ముఖ్యనేతలకు తెలిసే జరిగిందని ఆరోపించారు. అలాగే మండల పరిషత్ ఆధ్వర్యంలో ఉన్న గదులను జిల్లా పరిషత్ ద్వారా అనుమతులు పొంది వేలం ద్వారా కేటాయించాలని, అలా కాకుండా వైసీపీ వారికి కేటాయించి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వానికి జమ చేయకుండా దుర్వినియోగం చేశారని ఆరోపణలు రావడంతో వాటిని మండల పరిషత్ ఖాతాలో జమ చేశారని చెప్పారు. మండలంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలు వెలికి తీస్తామన్నారు. టీడీపీ నాయకులు మదనమోహన, సుబ్రహ్మణ్యం, దామోదరం, కుమారస్వామిరెడ్డి, చంద్రశేఖర్, మల్లిఖార్జునరెడ్డి, శ్రీధర్ రాయల్, తులసీ రాయల్, వెంకటరత్నం, ప్రతాపరెడ్డి, విజయశేఖర్‌గౌడ్, బెల్లంకొండ రమణ, సహదేవరెడ్డి, రాజగోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మా భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు



మాట్లాడుతున్న అవిలాల లోకనాథ రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 6: తాత ముత్తాల నుంచి తమకు సంక్రమించిన భూమికి మాసా కృష్ణమూర్తి, మమత, బిల్డర్ శ్రీనివాస్‌లు నకిలీ డాక్యుమెంట్లతో కబ్జా చేయడంతోపాటు అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని వేదాంతపురం గ్రామస్తులు అవిలాల లోకనాథ రెడ్డి, వాసుదేవరెడ్డి మరికొందరు ఆరోపించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ తుమ్మలగుంట రెవెన్యూ లెక్కదాఖలా వేదాంతపురం గ్రామ పంచాయతీ సర్వే నంబర్లు 216, 221/1, 221/2, 219/10లోని 1 ఎకరా 97 సెంట్ల భూమి తమకు తాత ముత్తాతలనుంచి వచ్చిందన్నారు. ఈ భూమిని తాముగాని, తమ పూర్వీకులుగాని ఎప్పుడూ ఎవరికీ విక్రయించలేదని స్పష్టం చేశారు. అయితే కృష్ణమూర్తి, మమత, బిల్డర్ శ్రీనివాస్ తమ భూమిని కాజేసేందుకు నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించేందుకు ప్రయత్నించారని చెప్పారు. తాము అడ్డుకోగా స్థానిక కోర్టు, జిల్లా కోర్టు, ఆపై హైకోర్టులో కేసులు వేశారని, అయితే వారు వేసిన మూడు కేసుల్లో సదరు భూమి మాకే చెందుతుందని కోర్టులు తీర్పునిచ్చాయని వెల్లడించారు. అయినప్పటికీ వారు మళ్లీ హైకోర్టులో దావా వేసి ఇంజక్షన్ ఆర్డర్ తీసుకువచ్చారని, కోర్టు ఆర్డర్‌ను గౌరవించి తాము భూమిలోకి అడుగు పెట్టలేదని చెప్పారు. కాని వారుమాత్రం కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను కాదని తమ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు ప్రారంభించారని చెప్పారు. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని, రాజకీయ రంగు జోడించి వివాదాస్పదం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై తాముకూడా కోర్టును ఆశ్రయిస్తామని, ఉన్నతాధికారులు తమపై జరుగుతున్న దౌర్జన్యాన్ని, తమ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్న వైనాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని వారుకోరారు. జనసేన నాయకులు పొన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవిలాల మఠం భూమిలో అక్రమ నిర్మాణాల తొలగింపు

- **స్టాంపు పేపర్లపై విక్రయించే భూములు కొని మోసపోవద్దు**
- **హథీరాంజీ మఠం పరిపాలనాధికారి రమేష్ నాయుడు**



ఎక్సకవేటర్‌తో తొలగిస్తున్న ఇల్లు

తిరుపతి(రూరల్), జూలై 6: తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామంలోని మఠం భూముల్లో చేపట్టిన నిర్మాణాలను శనివారం ఎక్సకవేటర్‌తో మఠం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా హథీరాంజీ మఠం పరిపాలనాధికారి రమేష్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ గ్రామంలోని సర్వేనెంబర్లు 13, 15, 17/2, 17/3, 17/5లలో 174.75 ఎకరాలభూమి హథీరాంజీ మఠానికి చెందినదని, దీన్ని రిజిస్టర్ డాక్యుమెంట్ల(985/1884) ద్వారా బుగ్గమఠం నుంచి కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇటీవల కొచ్చి శేషగిరిరావు అనేవ్యక్తి తమకు ఈభూమిలో కొంతభాగం వారసత్వంగా సంక్రమించిందని నమ్మబలుకుతూ కొంతమంది ల్యాండ్ మాఫియా సహాయంతో అక్రమ లేఅవుట్ల ద్వారా రిజిస్ట్రేషన్ లేకుండా స్టాంపు పేపర్లపై అమ్మి ప్రజలను మోసం చేస్తున్నట్లు సమాచారం అందిందని తెలిపారు. దీంతో శనివారం ఆ భూమిని సందర్శించగా.. అక్రమంగా రెండు నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి ఎక్సకవేటర్ సాయంతో తొలగించామని చెప్పారు. ఆక్రమణదారులు మఠం సిబ్బందిని బెదిరించడమే కాకుండా ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌పై దాడి చేశారని తెలిపారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఇక్కడికి చేరుకుని గొడవ చేస్తున్న ఆక్రమణదారులను పంపించేశారని పేర్కొన్నారు. మఠం భూములను ల్యాండ్ మాఫియా అక్రమ పద్ధతిల్లో విక్రయించడాన్ని నిరోధించేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని, త్వరలో మఠం భూములను విక్రయిస్తున్న కొచ్చి శేషగిరిరావుతోపాటు ఇతరులపై క్రిమినల్ కేసులు నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా స్టాంప్ పేపర్లపై మఠం భూములను విక్రయిస్తున్న ల్యాండ్ మాఫియా మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన ప్రజలను కోరారు.

సమయపాలన, జవాబుదారీతనం ముఖ్యం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6: కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు సమయపాలన పాటించి, జవాబుదారీ తనంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి అర్బన్: అంకితభావంతో పనిచేయాలని ఉద్యోగులకు కలెక్టర్ సూచించారు. సాయంత్రం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. తహసీల్దార్ నారాయణరెడ్డి, డీటీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కండలేరు జలాశయ పూడికతీత పనులు చేపట్టండి

తిరుపతి(కలెక్టరేట్): కండలేరు జలాశయ పూడిక తీత పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ అదితిసింగ్‌తో కలిసి శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత ఇరిగేషన్,కార్పొరేషన్ అధికారులతో సమీక్షించారు. ఈనెల 21వ తేదీనాటికి తిరుపతివాసులకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రోజుకు 250 క్యూసెక్కుల నీటిని నెలపాటు విడుదల చేయాలని చెప్పారు.నగరంలో ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు మోహన్, రమణారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆ రెండు చిరుతలూ వేర్వేరు

- **లక్షితను చంపిన చిరుత జూపార్కులోనే ఉంది**
- **జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి**

తిరుపతి(మంగళం), జూలై 6: కర్నూలు జిల్లా చెలిమ రేంజ్ పరిధిలోని పచ్చర్ల ప్రాంతంలో మాజీ ఉపసర్పంచ్ బషీరున్నీసాబీని చంపిన చిరుత, చిన్నారి లక్షితను చంపిన చిరుత వేర్వేరని తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సతీష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ ఇద్దరినీ చంపిన చిరుత ఒకటేనని కర్నూలు సబ్ డీఎఫ్‌వో శ్రీనివాస్‌రెడ్డి చెప్పడం సరికాదన్నారు. ఆయన పొరబాటున ఈ ప్రకటన చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే తిరుమల ఘాట్‌లోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయ సమీపంలో 2023 ఆగస్టు 11న దాడి చేసి చిన్నారి లక్షితను చంపిన చిరుతను పట్టుకోవడానికి అటవీశాఖ ప్రత్యేకంగా బోన్లు ఏర్పాటు చేసిందన్నారు. రెండునెలల వ్యవధిలోనే ఆరు చిరుతపులులు పట్టుబడ్డాయన్నారు. తొలుత పట్టుబడ్డ రెండు చిరుతల డీఎన్ఏలు లక్షిత డీఎన్ఏతో సరిపోకపోవడంతో నల్లమల అటవీప్రాంతంలోని గుండ్ల బ్రహ్మేశ్వరం ప్రాంతంలో వదలిపెట్టారన్నారు. అదేసమయంలో చిరుతల చెవి భాగంలో వాటి కదలికలను తెలుసుకునేందుకు చిప్స్ ఏర్పాటు చేశామన్నారు. పట్టుబడ్డ నాల్గవ చిరుత డీఎన్ఏ లక్షిత డీఎన్ఏతో సరిపోలడంతో ఆ చిరుతను ఎస్వీ జూపార్కులోనే ఉంచడం జరిగిందన్నారు. అయితే నల్లమల అటవీ ప్రాంతంలో జూన్ 28న పట్టుబడ్డ చిరుతను ఎస్వీ జూపార్కుకు తరలించారన్నారు. మాజీ ఉపసర్పంచ్ బషీరున్నీసాబీపై దాడి చేసి.. చంపిందనుకుంటున్న చిరుత డీఎన్ఏను, ఆమె డీఎన్ఏను ల్యాబ్‌కు పంపారని వివరాలు రాగానే అసలు వాస్తవాలు తెలుస్తాయన్నారు.

టీటీడీ నిర్ణయించిన ధరలకే విక్రయించాలి : ఈవో

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ నిర్ణయించిన ధరలకే వస్తువులను దుకాణదారులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో శ్యామలరావు శనివారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం పర్యవేక్షణలో శనివారం టీటీడీ ఉద్యోగులు భక్తుల తరహాలో శ్రీవారిమెట్టు వద్దనున్న షాప్ నెంబరు3లో గాజు సీసా నీటి బాటిల్ రూ.50 కొనుగోలు చేశారు. అనంతరం ఖాళీ గ్లాస్ బాటిల్ తిరిగి షాపు యజమానికి ఇవ్వగా.. రూ.20 తిరిగి వెనుకకు ఇచ్చారు. వాస్తవంగా రూ.30 తిరిగి ఇవ్వాలి. ఈక్రమంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తేలింది. అలాగే వీరు కొనుగోలు చేసిన దుకాణం ముందు నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిల్స్ కూడా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్టు గమనించారు. గతంలో కూడా ఈ షాపు యజమాని వినోద్‌కుమార్ టీటీడీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో అతడికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, రూ.25 వేలు జరిమానా విధించి హెచ్చరించారు. అయినప్పటికీ అతడు తన ధోరణిని మార్చుకోలేదని, ధరల పట్టిక ప్రదర్శించడం లేదని అధికారులు నివేదిక అందజేశారు. ఈనేపథ్యంలో మరోసారి టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు.

జనసేన తిరుమల కమిటీ ఎంపిక



నియామక పత్రాలను అందచేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జనసేన తిరుమల విభాగ అధ్యక్షుడిగా పగడాల మురళిని ఎంపిక చేసినట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ వెల్లడించారు. ప్రధానకార్యదర్శిగా జీవన్ రాయల్, ఉపాధ్యక్షులుగా సుధాకర్, భాస్కర్, రమణ, అధికార ప్రతినిధిగా విగ్నేష్(విక్కీ), జాయింట్ సెక్రటరీగా దినేష్, నవీన్, ఐటీ కోఆర్డినేటర్‌గా మోహన్, ట్రెజరర్‌గా కుమార్‌స్వామిని ఎంపిక చేశామన్నారు. కాగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేతుల మీదుగా కమిటీ సభ్యులు నియామక పత్రాలు అందుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలతోనే పేదరిక నిర్మూలన



విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న దాతలు

ఎర్రావారిపాలెం, జూలై 6: ప్రభుత్వ పాఠశాలలతోనే పేదరిక నిర్మూలన సాధ్యపడుతుందని ఎంఈవో-2 సతీష్ బాబు అన్నారు. మండలంలోని తొగటపల్లె ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు గుర్రంకొండ మండలం కోన జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.చెంగల్ రాయులు విద్యా సామగ్రిని అందచేశారు. చెంగల్ రాయులు తన స్వగ్రామమైన తొగటపల్లె ప్రాథమిక పాఠశాలలో గత 12 సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్నారు. ఎంఈవో సతీష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సి ఉందన్నారు. తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెట్రి బాక్సులు అందించడం ఎంతో తృప్తినిస్తుందని హెచ్ఎం చెంగల్ రాయులు అన్నారు. ఈ కార్యక్రమంలో చెంగల్‌రాయులు తండ్రి వెంకట్రామయ్య, కృష్ణమ్మ, నాగభూషణ, సీఆర్పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి-రేణిగుంట మధ్య సిటీ ఆర్డినరీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 6: చంద్రగిరి-రేణిగుంటల మధ్య తిరుపతి కేంద్రంగా రెండు సిటీ ఆర్డినరీ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వినతి మేరకు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి చర్యలు చేపట్టారు. రెండు సిటీ ఆర్డినరీ బస్సులను ప్రారంభించి నడుపుతున్నారు. ఉదయం 7గంటలకు డిపో నుంచి బయల్దేరిన బస్సులు ఒకటి రేణిగుంట, మరొకటి చంద్రగిరి బాటపడుతాయి. రేణిగుంట నుంచి తిరుపతి బస్టాండు, అక్కడి నుంచి లీలామహల్, అలిపిరి, రుయా ఆస్పత్రి, టౌన్‌క్లబ్, ఎస్వీయూ మీదుగా చంద్రగిరికి, మళ్లీ అదే దారిలోనే రేణిగుంటకు చేరుకుంటాయి. ఇలా రోజుకు ఆరు ట్రిప్పులు చొప్పున నడుస్తాయి. నూతన బస్సులు రాగానే అధికారికంగా ప్రకటించి ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే పుత్తూరు ఎమ్మెల్యే భానుప్రకాష్ వినతి మేరకు తిరుమణ్యం మీదుగా అప్పలాయగుంట, వెంకటరెడ్డికండ్రిగకు నడిచేలా బస్సుల రాకపోకలను పొడిగించారు. గత వారం రోజులుగా నడుస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని నూతన బస్సులు రాగానే అనుకూలతను పరిశీలించి పల్లెలకు ప్రజారవాణా విస్తరించే చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

తిరుమలేశుడి సేవలో విద్యారణ్య భారతీస్వామి



విద్యారణ్య భారతీస్వామి, మిథాలి మధుస్మిత, విఠల్ ప్రసాద్

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హంపీలోని విరుపాక్ష విద్యారణ్య మహాశ్రమం పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయ మహాద్వారం వద్దకు చేరుకున్న స్వామీజీకి టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం ఇస్తికాఫల్ స్వాగతం పలికారు. శిష్యబృందంతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన పుష్కరిణిని సందర్శించారు. అదేవిధంగా శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కమ్‌ట్యాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, ఎమ్మెల్యేలు రామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్సీ కమిషన్ చైర్మన్ విఠల్ ప్రసాద్, ఇండియన్ బ్యాంక్ ఎండీ శాంతిలాల్‌జైన్, టీటీడీ మాజీ ఈవో కృష్ణయ్య ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

డ్వాక్రా మహిళలకు ఆర్పీ కుచ్చుటోపి

13 గ్రూపులకు చెందిన రూ.14.18 లక్షల స్వాహా

పుత్తూరు అర్బన్, జూలై 6: డ్వాక్రా సంఘాలకు, మెప్మాకు మధ్య అనుసంధానకర్తగా ఉండాల్సిన ఆర్పీ (రిసోర్స్ పర్సన్) మహిళల కష్టార్జితాన్ని స్వాహా చేసింది. ఏకంగా రూ.14.18 లక్షల డ్వాక్రా సంఘాల నగదును సొంత అవసరాలకు వాడుకున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉన్నారు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక తీరిగ్గా ఆడిట్ పేరుతో ఏళ్లతరబడి కాలయాపన చేశారు. దీంతో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పును చెల్లించాలని నోటీసులు అందుకున్న మహిళలు లబోదిబోమంటూ శనివారం పోలీసులను ఆశ్రయించారు.బాధిత మహిళల కథనం మేరకు....పుత్తూరు మున్సిపల్ పరిధిలోని ఆరేటమ్మ, ఎన్టీఆర్ కాలనీలకు చెందిన డ్వాక్రా సంఘాలకు ఆర్పీగా భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారు. 2016-2018 సంవత్సరాల మధ్య డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి చెల్లింపులను తానే జమచేస్తానని నగదు వసూలు చేశారు. అయితే బ్యాంకులకు చెల్లించకుండా సొంత అవసరాలకు వాడుకున్నారు. దీంతో పాటు మిగిలిన కంతులన్నీ ఒకేసారి జమచేస్తే కొత్తగా రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పి రూ.లక్షల్లో వసూలు చేశారు. ఆఖరికి మహిళలు నెలానెలా జమ చేసే పొదుపు నగదును కూడా సంఘాల నుంచి అప్పుగా తీసుకున్నారు. 2020లో ఆరేటమ్మ కాలనీకి చెందిన నెహ్రూ సంఘానికి మంజూరైన రూ.3 లక్షల శ్రీనిధి సొమ్మును కూడా వాడేసుకోవడంతో ఆ గ్రూప్ సభ్యులు మెప్మా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకి వచ్చింది. దీంతో పలువురు గ్రూప్ సభ్యులు కూడా తమకు జరిగిన అన్యాయంపై వరుసపెట్టి ఫిర్యాదులు చేశారు. దీంతో ఆర్పీ భాగ్యలక్ష్మి పరిధిలో ఉన్న 28 సంఘాల అకౌంట్లకు ఆడిట్ నిర్వహించారు. ఈ తంతు ఏడాదిపాటు సాగింది. చివరగా మొత్తం 13 సంఘాలకు చెందిన రూ.14.18 లక్షల నగదు స్వాహా చేసినట్లు తేలింది. దీంతో గత ఏడాది ఆర్పీ భాగ్యలక్ష్మిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. అయితే ఆమె స్వాహా చేసిన నగదును తిరిగి రాబట్టడంలో మాత్రం మెప్మా అధికారులు విఫలమయ్యారు. ఇటీవల బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించాలని నోటీసులు వస్తుండడంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని శనివారం పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక ఆర్పీ డ్వాక్రా సంఘాల నగదును రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉండటంపై తీవ్రస్థాయిలో విమర్శలు తలెత్తుతున్నాయి.

ఘనంగా సహకార దినోత్సవం



తిరుపతి (కలెక్టరేట్), జూలై 6: అంతర్జాతీయ సహకార దినోత్సవం తిలక్ రోడ్డులోని ఆ శాఖ కార్యాలయంలో శనివారం ఘనంగా జరిగింది. జిల్లా సహకార అధికారి లక్ష్మీ, జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేకాధికారి నారాయణమ్మ, మద్దిపట్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులతో యూపీ చైర్మన్ భేటీ



ఆర్టీసీ అధికారులతో చర్చిస్తున్న వెంకటేశ్వర్లు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 6: జిల్లా ప్రజారవాణాధికారులతో ఉత్తర్‌ప్రదేశ్ (యూపీ) రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ వెంకటేశ్వర్లు శనివారం భేటీ అయ్యారు. ఉదయం స్థానిక ప్రజారవాణాధికారి కార్యాలయంలో డీపీటీవో చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ నరసింహులు, డీఎంలు రామచంద్రనాయుడు, బాలాజీ, హరిబాబులతో సమావేశమయ్యారు. ఉత్తర్‌ప్రదేశ్ అయోధ్య, వారణాసి, ప్రయాగ, మధుర వంటి పుణ్యక్షేత్రాలకు క్రమేణ భక్తుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా వారికి రవాణా కల్పించే విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ పుణ్యక్షేత్రానికి కేంద్రంగా ఉన్న తిరుపతిలో భక్తుల రవాణా విషయంలో అనుసరిస్తున్న విధివిధానాలపై చర్చించారు. అలాగే శ్రీకాళహస్తి, కాణిపాకం, తమిళనాడు దేవాలయాలకు, పర్వదినాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాలకు బస్సులు నడిపే విధానాన్ని, భక్తులకు కల్పించే సౌకర్యాలను అధికారులు తెలియజేశారు. అనంతరం ఆయన అలిపిరి డిపో గ్యారేజీని సందర్శించారు. అక్కడ ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్, పార్కింగ్, డీజిల్ బస్సుల మెయింటనెన్స్ తదితరాలను కూడా పరిశీలించారు. సోమవారం ఆయన తన బృందంతో కలసి సెంట్రల్ బస్సుస్టేషన్, తిరుమలను సందర్శించనున్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో అరుదైన శస్త్రచికిత్స



రోగి వివరాలు తెలియజేస్తున్న వైద్యులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6: తిరుపతి-రేణిగుంట మార్గంలో ఉన్న ఆస్టర్ నారాయణాద్రిలో స్వామి (62) అనే వ్యక్తికి అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు శనివారం ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. సీఏవో డాక్టర్ శ్రీధర్ ముని మీడియాకు వివరాలు తెలిపారు. స్వామికి కుడి భుజం కింద కణితి ఉండటంతో తమ ఆస్పత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ విజయకుమార్‌రెడ్డి వద్దకు వచ్చాడన్నారు. నడిచేటపుడు, పడుకున్నపుడు ఇబ్బందిగా ఉండటంతో తమను సంప్రదించినట్లు చెప్పారు. కణితి 15ఇన్‌టూ 12సెం.మీ.గా ఉండగా.. ఆపరేషన్ చేసి బయటకు తీశాక 28ఇన్‌టూ 15సెం.మీ.గా ఉండి ఆశ్చర్యపరిచిందన్నారు. కొవ్వు కణితిలు సాధారణం అయినప్పటికీ చాతీ నుంచి మొదలై చేతి వరకు ఉండటం చాలా అరుదన్నారు. ఆపరేషన్ తర్వాత ఆరోగ్యంగా స్వామి ఆరోగ్యంగా ఉన్నాడని వివరించారు.

ఇద్దరు హోంగార్డులకు ఆర్థిక సాయం



కవితకు చెక్కు అందచేస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి (నేరవిభాగం), జూలై 6: పదవీ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులను ఎస్పీ హర్షవర్ధన రాజు సన్మానించారు. హోంగార్డు రాధాకృష్ణ, గోపాల్ రెడ్డిలను సన్మానించి ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల చెక్కులను అందజేశారు. అలాగే టీటీడీ విజిలెన్సులో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన మోహన్ భార్య కవితకు రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేశారు. హోంగార్డులు అందరూ ఒక్కరోజు వేతనాన్ని ఇవ్వడం హర్షణీయని ఎస్పీ అన్నారు. అదనపు ఎస్పీలు, హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ పోతల రాజు, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా, పాన్‌పరాగ్ అమ్మకాలపై తనిఖీలు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 6: పాఠశాలలు, కళాశాలల సమీపంలోని దుకాణాల్లో గుట్కా, పాన్‌పరాగ్ అమ్మకాలపై ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాలతో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. మొత్తం నాలుగు బృందాలుగా విడిపోయి తనిఖీలు చేసి, దుకాణాల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

లిటిల్ ఏంజల్స్‌లో నూతన క్యాబినెట్ ఏర్పాటు



తిరుపతి(విద్య), జూలై 6: యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ పాఠశాలలో శనివారం విద్యార్థుల నూతన క్యాబినెట్ ఏర్పాటు చేశారు. కెప్టెన్, వైస్ కెప్టెన్లతోపాటుగా అపెక్స్ బాడీని ఎన్నుకున్నట్లు స్కూల్ చైర్‌పర్సన్ ఎం.రమాదేవి తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వవిద్యార్థి, ఏసీబీ డీఎస్పీ వై.జెస్సీ ప్రశాంతి నూతన క్యాబినెట్ ప్రతినిధులను అభినందించారు. కరస్పాండెంట్ కె.రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, టీచర్లు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీ ప్రొఫెసర్ మృతి



జ్యోతి (ఫైల్ ఫొటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6: పద్మావతి మహిళా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ సింగరాజు జ్యోతి మృతి చెందారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతుండగా వారం క్రితం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేశారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడంతో వర్సిటీలో సంతాప సభ నిర్వహించారు. సహ ప్రొఫెసర్లు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబీకులకు సానుభూతిని తెలియజేశారు. కాగా, 2009లో జ్యోతి యూనివర్సిటీలో చేరారు. కంప్యూటర్ సైన్స్ హెడ్‌గా, కంప్యూటర్ సెంటర్ డైరెక్టర్‌గా, ఐక్యూఏసీ సెల్ సభ్యురాలిగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలు అందించారు.

తుడా పాలనపై విచారణ జరిపించండి

సీఎం చంద్రబాబుకు చెవిరెడ్డి లేఖ

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో జరిగిన పాలనపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి శనివారం లేఖ రాశారు. 'తుడా పరిధిని పెంచి ఆర్థిక వనరులను సృష్టించాం. ప్రభుత్వ భూములను తుడా ద్వారా కొనుగోలు చేసి లేఅవుట్లు వేసి విక్రయించాం. ప్రభుత్వ విభాగాల్లో తుడా నిధులు జమ చేసి.. అభివృద్ధి చేయడం ఆనవాయితీ. అందులో భాగంగానే ఎంపీడీవో కార్యాలయాలకు కలెక్టర్ అనుమతితో పనులు చేయించడం జరిగింది. అప్పటి కలెక్టర్ రవిచంద్ర సూచనల మేరకే తుమ్మలగుంట చెరువును తుడా పరిధిలోకి తీసుకొచ్చి అభివృద్ధి చేశాం. తుడాలో జరిగిన అభివృద్ధి పనులపై అనుమానం ఉంటే విచారణకు ఆదేశించా'లని చెవిరెడ్డి తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలి : కమిషనర్

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బందిని కమిషనర్ అదితిసింగ్ ఆదేశించారు. స్కావెంజర్స్ కాలనీ, కొత్తూరు, శివజ్యోతి నగర్, అయ్యప్ప కాలనీ ప్రాంతాల్లో శనివారం ఉదయం ఆమె పరిశీలించారు. ముఖ్యంగా డయేరియా, మలేరియా, డెంగీ ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిరంతరం కాలువలు శుభ్రపరిచి, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల దందాపై చర్యలు తీసుకోండి : బీజేపీ

తిరుపతి (జీవకోన), జూలై 6: నగర పాలకసంస్థలో గత ప్రభుత్వంలో జరిగిన టీడీఆర్ బాండ్ల దందాపై చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ దందాకు సహకరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే పీఏగా పని చేస్తూ కార్పొరేటర్‌గా అవతారం ఎత్తి టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, మాజీ కమిషనర్లతోపాటు ఐదుగురు కార్పొరేటర్లు,అప్పటి అధికార పార్టీ కీలక వ్యక్తులను రాష్ట్రప్రభుత్వ విజిలెన్స్ అధికారుల ద్వారా అదుపులోకి తీసుకుని విచారిస్తే దోపిడీ వెలుగులోకి వస్తుందన్నారు.ఈ దోపిడీపై సమగ్ర సమాచారంతో కూడినపత్రాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతున్నట్లు తెలిపారు.ఈ వ్యవహారంపై సీఎం, డిప్యూటీ సీఎం, మున్సిపల్ శాఖ మంత్రి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలన్నారు.

సమన్లు, వారెంట్లు సకాలంలో అందచేయండి

కోర్టు కానిస్టేబుళ్లకు ఎస్పీ దిశా నిర్దేశం

తిరుపతి(నేరవిభాగం), జూలై 6: సకాలంలో వారెంట్లు, సమన్లు అందచేయాలని కోర్టు కానిస్టేబుళ్లను ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశించారు. పోలీసు మైదానంలో శనివారం వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌ను వైసీపీ జేబు సంస్థలా మార్చేసింది

మాస్టర్ ప్లాన్ రోడ్లపై పునఃసమీక్ష ● అర్హులకు టీడీఆర్ బాండ్లు ● ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించి ఫుడ్ కోర్టులు ఏర్పాటు ● మున్సిపల్ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం తన జేబు సంస్థలా మార్చేసిందని, అడ్డగోలు నిర్ణయాలతో సాధారణ నిధులన్నీ స్వాహా చేసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అసహనం వ్యక్తం చేశారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే తొలిసారి సమీక్షించారు. ఎన్నికలకు ముందు వైసీపీ నాయకులు హడావుడిగా చేసిన పనులన్నీ నాణ్యత లోపం ఉన్నట్టు గుర్తించామన్నారు. ముఖ్యంగా మాస్టర్ ప్లాన్ రోడ్ల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. వీటిపై థర్డ్‌పార్టీ కమిటీ ఏర్పాటు చేసి.. నాణ్యతను పరిశీలించాకే కాంట్రాక్టర్లకు బకాయి బిల్లులను చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అర్హులకు ఇవ్వాల్సిన టీడీఆర్ బాండ్ల చెల్లింపులు సకాలంలో చెల్లించాలను సూచించారు. గతంలో టిడ్కో ఇళ్లకోసం ప్రభుత్వానికి చెల్లించిన మొత్తాన్ని తిరిగి లబ్ధిదారులకు అందించేలా చూడాలన్నారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించి, అక్కడక్కడా ప్రత్యేక ఫుడ్ కోర్టులు ఏర్పాటుచేయాలన్నారు. దాదాపు నాలుగు లక్షల జనాభా ఉన్న నగరంలో రోజూ లక్షమంది యాత్రికులు వచ్చిపోతుంటున్నారన్నారు. అందువల్ల పారిశుధ్యం, రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. చాలా కాలువల్లో వ్యర్థాలు నిండిపోయి మురుగు సాఫీగా వెల్లడం లేదనే విషయాన్ని అధికారుల దృష్టికి ఎమ్మెల్యే తీసుకొచ్చారు. రైతు బజార్, మార్కెట్లు, ఫిష్ మార్కెట్లను ఆధునికీకరిస్తే బాగుంటాయని, వీటిల్లోనూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. నగరంలోని అంతర్గత రోడ్లపై ప్యాచ్ వర్కులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. మురికివాడల్లోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తిరుపతి అభివృద్ధికి అందరం కలిసికట్టుగా సమన్వయంతో పనిచేద్దామని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, కమిషనర్ అదితి సింగ్, ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్, రుయాస్పత్రిలో ఎమ్మెల్యే తనిఖీలు



రుయాస్పత్రిలో అధికారులతో సమావేశమైన ఆరణి



స్విమ్స్‌లో రోగిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

తిరుపతి(వైద్యం), జూలై 6: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వైద్యాధికారులకు ఆదేశించారు. స్విమ్స్, రుయాస్పత్రులను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అత్యవసర విభాగం, వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వైద్యం, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లను, వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రుల అభివృద్ధిపై వైద్యాధికారులతో సమీక్షించారు. పలు సమస్యలను అధికారుల ఆయన దృష్టికి తేగా సీఎంకి తెలియజేసి, పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం రుయాస్పత్రిలో మీడియాతో మాట్లాడారు. రుయాస్పత్రికి రాయలసీమలోనే మంచి గుర్తింపు ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఇక్కడ వైద్యం అందించిన చరిత్ర కూడా ఉందని గుర్తుచేశారు. రుయాస్పత్రి అత్యవసర విభాగంలో ఒకే పడకపై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించి, పడకల సంఖ్య పెంచాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంస్ రామ్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఏఆర్ఎంవో హరికృష్ణ, వైద్య విభాగాధిపతులు పాల్గొన్నారు.

కలెక్టర్ న్యాయం చేయకుంటే మరణమే శరణ్యం

● వెంకటసుబ్బమ్మ ఆవేదన



నిరసన తెలుపుతున్న వెంకటసుబ్బమ్మ తదితరులు

తిరుపతి (జీవకోన), జూలై 6: తమకు కలెక్టర్ న్యాయం చేయకుంటే మరణమే శరణ్యమని వెంకటసుబ్బమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబీకులతో కలిసి వివాదానికి కారణమైన స్థలం ఉన్న సంజయ్‌గాంధీ కాలనీ డోర్ నెంబరు 2-5-746/3 ముందు ఆమె నాలుగు రోజులుగా నిరసన చేస్తున్నారు. ఆమె మాట్లాడుతూ.. తిరుమల బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో 40 ఏళ్లుగా నివాసం ఉంటూ కార్పొరేషన్‌కు అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నామని చెప్పారు. అటువంటి స్థలాన్ని కాజేయాలని చూస్తున్నా.. అధికారులు, పోలీసులు నుంచి ఎలాంటి న్యాయం జరగలేదన్నారు.1991, 2000సంవత్సరాల్లో కొందరు తప్పుడు పత్రాలతో తమ స్థలాన్ని కాజేయడానికి కోర్టుకు వెళ్లారని అయితే కోర్టు కూడా తమవైపే తీర్పు ఇచ్చిందని తెలియజేశారు. గతంలో ఉన్న పూరిగుడిసెలు తొలగించి ప్రస్తుతం రేకుల షెడ్ వేస్తున్న సమయంలో గోపీకృష్ణారెడ్డి అనే వ్యక్తి తమపై దౌర్జన్యంచేస్తూ.. తప్పుడుపత్రాలు సృష్టించి అధికార పార్టీ నాయకుల అండతో తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని వాపోయారు. న్యాయం జరిగేవరకు తాము దీక్ష విరమించేది లేదని స్పష్టం చేశారు. సోమవారం నుంచి ఏడాది చంటి బిడ్డతోపాటు నిరాహార దీక్ష చేస్తామన్నారు.

అసలు కబ్జాదారులెవరో నిగ్గు తేల్చండి

● టీడీపీ నాయకుడి డిమాండ్



మీడియాతో రజనీకాంత్

తిరుపతి (ఉపాధ్యాయనగర్), జూలై 6: అసలు కబ్జాదారులెవరో నిగ్గు తేల్చాలని టీడీపీ నాయకుడు కంకణాల రజనీకాంత్ డిమాండ్ చేశారు. గోపీకృష్ణారెడ్డితో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. బండి వెంకటసుబ్బమ్మ స్థలం తిరుమల బైపాస్‌ని ఆనుకుని ఉండేదన్నారు. అది బైపాస్ నిర్మాణంలో రోడ్డుకు పోయిందన్నారు. అయితే పక్కనే ఉన్న గోపీకృష్ణారెడ్డి స్థలాన్ని తమదిగా వారు భావిస్తున్నారని చెప్పారు. సదరు స్థలానికి చెందిన విషయాలు, పత్రాలు పరిశీలించాక గోపీకృష్ణారెడ్డే బాధితుడని తనకు అనిపించిందన్నారు. ఈ నేపథ్యంలో సాయం చేయాలన్న అతడి విజ్ఞప్తిపై పోలీసులు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరానన్నారు. అయితే బండి వెంకటసుబ్బమ్మ వర్గీయులు మాత్రం తాను ఆ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయడాన్ని ఖండించారు. ఇకనైనా అధికారులు స్పందించి వివాదాస్పద భూమిని సర్వేచేయించి ఎవరు కబ్జాదారులో తేల్చాలన్నారు.

సురేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోండి

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు టీఎన్ఎస్ఎఫ్ విజ్ఞప్తి



ఎస్వీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్యకు వినతి పత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6: ఏక కాలంలో రెండు వేతనాలు పొందిన లెక్కల మాస్టారు సురేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ కోరింది. టీఎన్ఎస్ఎఫ్ నాయకుల బృందం శనివారం వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ.. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో టైం స్కేల్ ఉద్యోగిగా ఉంటూనే, తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డికి ఓఎస్డీగా పనిచేస్తూ రెండు వైపులా వేతనం పొందిన సురేష్‌రెడ్డిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ● అలాగే, హైదరాబాదు జేఎన్‌టీయూ నుంచి డిప్యుటేషన్‌పై ఎస్వీయూకు వచ్చిన ప్రొఫెసర్ అపర్ణపైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అంశానికి పాలక మండలి ఆమోదం కూడా లేకపోవడం చట్ట విరుద్ధమని వారు పేర్కొన్నారు.భీష్మ, బషీర్, ఆంజనేయులు, రంగన్న, మల్లి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో బాలకేంద్రం ప్రారంభం



తిరుపతి రూరల్, జూలై 6: జాతీయ సంస్కృత వర్సిటీలో ఉచిత సంస్కృత బాలకేంద్రాన్ని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి శనివారం పునఃప్రారంభించారు. ఈ కేంద్రంలో వారంలో రెండ్రోజుల (శని, ఆదివారం)పాటు విద్యార్థులకు సంస్కృతం మాట్లాడడం, శ్లోకాలు చదవడం వంటి అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. నగరంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే నగరంలోని వివిధ ప్రాంతాల్లో 50సంస్కృత కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. సంస్కృత భారతి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ నందన్‌భట్, కోఆర్డినేటర్ సమీర్‌సాహ, టీచర్లు విద్యాసుధ, ప్రీతిసురేష్, సుబ్రమణ్యం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ వెంకటేశ్వర్లుపై సీఐడీ విచారణ జరపాలి

వైసీపీ నేత దుద్దేల బాబు

తిరుపతి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): 23వ డివిజన్ వైసీపీ కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లుపై సీఐడీ విచారణ చేపట్టాలని అదే పార్టీకి చెందిన నాయకుడు దుద్దేల బాబు సోషల్ మీడియాలో మెసేజ్ పంపడం చర్చగా మారింది. తమ నాయకుడు భూమన కరుణాకర రెడ్డి వద్ద చేరిన కొత్తలో వెంకటేశ్వర్లు ఆస్తి ఎంత? 2014-19 వరకు అతని ఆస్తి ఎంతో సీఐడీ కస్టడీకి తీసుకుని విచారణ చేపడితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని దుద్దేల బాబు పేర్కొన్నారు. తిరుపతి, తమిళనాడు, బెంగళూరు తదితర ప్రాంతాల్లో దాదాపు రూ.100కోట్ల ఆస్తులు కూడబెట్టారని ఆరోపించారు. టీడీఆర్ బాండ్ల కుంభకోణంలోనూ ఇతని ప్రమేయం ఉందని, విచారణ జరిపితే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని బాబు పెట్టిన మెసేజ్ వైరలైంది.

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి అనుషా

వెంకటగిరి, జూలై 6 : చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని వెంకటగిరి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ అనూష పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొన్ని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ చట్టబద్ధంగా జీవించడం అలవరుచుకోవాలని సూచించారు. మహిళల ప్రత్యేక చట్టాలు, హక్కులు గురించి విద్యార్థులకు వివరించారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా శిక్షర్హులని చెప్పారు. ఎవరైనా న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినప్పుడు బాధితుల ఫిర్యాదులు స్వీకరించకుండా వుంటే నేరుగా న్యాయస్థానానికి వచ్చి అర్జీ రూపంలో దాఖలు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు దుగ్గి రాజారావు, గాంధీ,రాజేష్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు


పెంపుడు జంతువులకు రేబిస్ టీకా వేస్తున్న డాక్టర్ సురేష్

గూడూరు, జూలై 6: స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో శనివారం జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాధి సోకుండా ఉండేలా టీకాలను వేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సురేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు కానీ, మనుషుల నుంచి పెంపుడు జంతువులకు కానీ సంక్రమించే వ్యాధులను జొనోటిక్ వ్యాధులు అంటారన్నారు. పెంపుడు జంతువుల యజమానులు వాటి ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు వహించి వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


ప్రోత్సాహం అందుకున్న విద్యార్థులతో కాపు, బలిజ సంఘం నాయకులు

చిల్లకూరు, జూలై 6: చింతవరం ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు శనివారం కావలి పట్టణానికి చెందిన కాపు, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. హెచ్‌ఎం శివసుబ్రమణ్యం మాట్లాడుతూ కాపు, బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తమ పాఠశాలలో 10వ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాక బహుమతులు అందజేశారన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తోట వెంకటశేషయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చిల్లకూరు, జూలై 6: మండలంలోని ఉడతావారిపాల్లపల్లెలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ జగ్జీవన్‌రామ్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో డాక్టర్ జగ్జీవన్‌రామ్ వర్థంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఉప ప్రధానిగా ఉన్న సమయంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రవి, వెంకటరమణయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, వాసు, సురేష్, పెంచలయ్య, సుబ్బారావు, కుబేష్, వెంకటయ్య పాల్గొన్నారు.

నిత్య పూజావిధానంపై చాగంటి ప్రవచనాలు

నాయుడుపేట టౌన్, జూలై 6 : భగవంతుడి కరుణ, కృప, కటాక్షాల కోసం నిత్య పూజావిధానంలో చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలను బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. నాయుడుపేట కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ హాల్‌లో శనివారం సాయంత్రం చాగంటి కోటేశ్వరరావుచే నిత్య పూజావిధానంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. సృష్టిలో ప్రతి వస్తువు భగవంతుడి సృష్టి అని, అవి సన్మార్గంలో ఉపయోగిస్తే సత్‌ఫలితాలు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పంచభూతాల సాక్షిగా నిత్య పూజా విధానాలు చేసి సన్మార్గం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి చాగంటి ప్రవచనాలు విని తరించారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం



నాయుడుపేట టౌన్, జూలై 6 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం నెల్లూరు సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత వాసు శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, సుబ్బన్న, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థులచే నగదు పురస్కారాలు

నాయుడుపేట, జూలై 6 : నాయుడుపేట బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు 1987-88 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు నగదు పురస్కారాలు శనివారం అందజేశారు. నెలవాయి ఆదర్శరెడ్డి 557 మార్కులతో పాఠశాల ప్రథమస్థానం రావడంతో రూ.5వేలు, నేదూరు భవ్యశ్రీ 537 ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, ఎలుగంటి కౌశిక్ 536 మార్కులతో తృతీయ బహుమతిగా రూ.2వేలు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ఎంఈవో శాంతి, మునిరత్నం, హెచ్‌ఎం సురేష్, చంద్రశేఖర్, షఫీఉల్లా, పూర్వ విద్యార్థులు గోపీనాథ్‌రెడ్డి, రమేష్‌బాబు, సత్యనారాయణరెడ్డి, చిరంజీవి, రజనీబాబు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

నేడు యూపీఎస్సీ పరీక్షలు

- జిల్లాలో 10 కేంద్రాలు, హాజరు కానున్న 5,273మంది అభ్యర్థులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 6: జిల్లాలో ఆదివారం జరగనున్న యూపీఎస్సీ ఈపీఎఫ్‌వో, ఈఎస్‌ఐసీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈపీఎఫ్‌వోలోని పర్సనల్ అసిస్టెంట్ పోస్టులకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మూడు సెంటర్లలో.. ఈఎస్‌ఐసీలోని నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులకు మధ్యాహ్నం 2.30నుంచి 4.30గంటల వరకు ఏడు సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. మొత్తం 5,273మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆర్డీవో నిషాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

వారాహి అమ్మవారికి పూజలు



గూడూరు అర్బన్, జూలై 6: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో శనివారం వారాహి అమ్మవారి హోమ పూజలు నిర్వహించినట్లు నిర్వాహకుడు కోట సునీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి 15వ తేదీ వరకు వారాహి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 6: కలవకొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయం త్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ జరిపి ఆలయం సమీపంలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్యే దాతృత్వం

గూడూరు అర్బన్, జూలై 6: స్థానిక 10వ వార్డులో సుబ్బయ్య అనే టీడీపీ కార్యకర్త అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. దీంతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో రూ. 3వేలు ఆర్థికసాయాన్ని సుబ్బయ్య కుటుంబసభ్యులకు టీడీపీ నాయకురాలు భారతి, నాయకుడు సుధాకర్ అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో లారీ క్లీనర్ మృతి

తడ, జూలై 6 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిత్తూరు జిల్లా గుడిపాల మండలం రామాపురం గ్రామానికి చెందిన కనకం జయచంద్ర (44) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం నాయుడుపేటలో సరుకు రవాణాకోసం వచ్చి లోడ్ చేసుకొని చెన్నైవైపు బయలుదేరాడు. మార్గ మధ్యలో శుక్రవారం తెల్లవారుజామున పూడి గ్రామం వద్దకు వచ్చేసరికి లారీని ఆపి అక్కడ టీ తాగారు. ఈ సమయంలో క్లీనర్ జయచంద్ర లారీ వెనుక వైపు తనిఖీ చేస్తున్న సమయంలో లారీ డ్రైవర్ నాగరాజు వెనుక ఉన్న జయచంద్రను గమనించకుండా లారీని స్టార్ట్ చేసి వెనక్కుతీసుకురావడంతో జయచంద్రపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో క్లీనర్ జయచంద్ర తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డక్కిలి మాజీ ఎంపీపీ మృతి


రోశయ్య నాయుడు (ఫైల్‌ఫొటో)

డక్కిలి, జూలై 6 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, డక్కిలి మండలం పాతనాలపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ ఈతముక్కల రోశయ్య నాయుడు(72) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున కన్ను మూశారు. ఈ సమాచారం తెలియగానే ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దిగ్భ్రాంతి చెందారు. ఆయన కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే

గూడూరు, జూలై 6: ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ పాపారావు అన్నారు. శనివారం టవర్‌క్లాక్ కేంద్రం వద్ద హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో తలకు ఎటువంటి గాయాలు కాకుండా, ప్రాణాపాయ స్థితికి చేరుకోకుండా ఉండేందుకు హెల్మెట్ దోహదపడుతుందన్నారు కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీహరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రైస్‌మిల్లు తనిఖీ

సూళ్లూరుపేట, జూలై 6: పట్టణంలోని ప్రేమసాయి రైస్‌మిల్లును శనివారం తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తనిఖీ చేశారు రైస్‌మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలు, తయారీ చేస్తున్న బియ్యం బస్తాలను ఆయన తనిఖీ చేసి యాజమాన్యాన్ని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా రైస్‌మిల్లు యజమానులు పాటించాలని, లేనియెడల చర్యలు తీసుకొంటామన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి

పెళ్లకూరు, జూలై 6 : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చెంబేడులో వైద్యసిబ్బందితో కలసి ఇంటింటా సర్వేచేసి పాత టైర్లు, తొట్టెలు తదితర వస్తువులను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని కింద పోయించి పరిసరాలను శుభ్రపరిచారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దని సూచించారు. ప్రజలు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య సేవలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

ఉపాధి పనులు చేయకనే బిల్లుల స్వాహా

- రూ.37,099 రికవరీకి, రూ.93,500 జరిమానా వసూళ్లకు ఆదేశాలు


సభలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

వరదయ్యపాళెం, జూలై 6: ఉపాధి పనులను చేయకనే రికార్డులను సృష్టించి బిల్లులు స్వాహా చేశారు. సామాజిక తనిఖీల్లో అవకతవకలు వెలుగు చూడడంతో క్షేత్ర సహాయకురాలు, సాంకేతిక సహాయకురాలిని తొలగిస్తూ డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. వరదయ్యపాళెం మండలంలో 2022 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన శనివారం జరిగింది. పలు పంచాయతీల్లో సంతకాలు లేకనే చెల్లింపులు చేయడం, చేసిన పనుల్లో కొలతల వ్యత్యాసం, రికార్డులకు పొంతన లేకపోవడం, కూలీల వేతన గణనలో తేడాలు వంటి పలు అవకతవకలను గుర్తించారు. రూ.37,099 రికవరీతో పాటు సిబ్బంది నుంచి రూ.93,500 జరిమానా వసూలు చేసేలా డ్వామా పీడీ ఆదేశాలు జారీ చేశారు. అలాగే రాచర్లలో పూర్తి చేయని పక్కా ఇంటి నిర్మాణం పూర్తయినట్లు నమోదు చేసిన గృహనిర్మాణశాఖ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల నుంచి రూ.12వేల రికవరీకి ఆదేశించారు. పాండూరులో ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల పేరుతో రికార్డులు నమోదు చేసి చేతివాటం ప్రదర్శించిన క్షేత్ర సహాయకురాలు లక్ష్మి, పనులను పర్యవేక్షించకుండా సంతకాలు చేసిన సాంకేతిక సహాయకురాలు లత సస్పెన్షన్‌కు పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ రాసరాయనాయుడు, డీఆర్‌డీఏ ఏపీడీ ప్రశాంతి, ఉపాధి ఏపీడీ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూములు... వైసీపీ సర్పంచ్ స్వాహా

- గతంలో తహసీల్దార్ నిర్వాకంతో పట్టాదారు పాసుబుక్కు మంజూరు
- లబోదిబోమంటున్న దళితులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద వెలుగాజులపల్లి దళితులు

చిట్టమూరు, జూలై 7 : గతంలో ఓ తహసీల్దార్ చేసిన నిర్వాకం వల్ల తొమ్మిది మంది రైతులు వీధిన పడిన ఘటన చిట్టమూరు మండలంలో చోటు చేసుకుంది. తొమ్మిది మందితో జాయింట్ పట్టా ఉన్న దళితుల భూమిని స్థానిక సర్పంచ్ తన తల్లి సుజాతమ్మ పేరు మీద పట్టా చేయించుకుని వీధిన పడేశారు. తీరా అసలు విషయం తెలుసుకున్న రైతులు అవాక్కయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి... చిట్టమూరు మండలం ఎల్లూరు పంచాయతీ వెలుగాజులపల్లికి చెందిన తొమ్మిది మంది దళితులకు సర్వే నెంబర్ 163-2లో 3.83 ఎకరాల భూమిని 20ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం జాయింట్ పట్టా మంజూరు చేసింది. అప్పటినుంచి లబ్ధిదారులు పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పార్టీ మద్దతుదారు సర్పంచ్‌గా ఎన్నిక కాబడిన సుమతి తన అధికార బలంతో అధికారులను గుప్పిట్లో పెట్టుకొని దళితుల పేరు మీదున్న జాయింట్ పట్టా భూమిని తన తల్లి పేరున పట్టా చేయించుకుని పాస్‌బుక్ చేయించుకుందని దళిత రైతులు ఆరోపించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ తమ భూములను సర్పంచ్‌కు పట్టా చేశారని వాపోయారు. తమ భూములతో పాటు చెరువు కట్టను కూడా సర్పంచ్ కలిపేసుకున్నాడని ఆరోపించారు. గత ప్రభుత్వంలో అధికారులకు చెప్పుకున్నా తమ గోడు వినిపించుకోలేదని, పైగా పోలీసుల సమక్షంలో సర్పంచ్ తమ పొలంలో నాటిన వరి పైరును తొక్కించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి పోలీసులు, రెవెన్యూ అధికారులు తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం స్పందించి సమగ్రంగా విచారించి తమకు న్యాయం చేయాలని శనివారం తహసీల్దార్ శ్రీనివాసశర్మకు వినతి పత్రం సమర్పించారు.

మంత్రుల దృష్టికి నియోజకవర్గాల సమస్యలు


మంత్రులతో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

నెల్లూరు, జూలై6 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నెల్లూరు జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి చేయాలని జిల్లా టీడీపీ నేతలు నిర్ణయించుకున్నారు. మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిల నేతృత్వంలో శనివారం జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు సమావేశమ య్యారు. మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, అందుకు చేయాల్సిన కృషి అనే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షలో కలెక్టర్ ఆనంద్, జేసి సేథు మాధవన్ కూడా పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గాల వారీగా నెలకొన్న సమస్యలు, ప్రజల అవసరాలను ఎమ్మెల్యేలు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కలెక్టర్‌కు మంత్రులు వివరించి, సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో మంచి వాతావరణంలో జిల్లాను అభివృద్ధి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశ వివరాలను మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ మీడియాకు వివరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన అర్థవంతమైన చర్చ జరిగిందన్నారు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర పాలన ప్రారంభమైందని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని వారు తెలిపారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ఇదివరకే ఉన్న పరిశ్రమల్లో కల్పించాల్సిన మౌలిక వసతులపై ఎమ్మెల్యేలు కలెక్టర్, జేసీల దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. త్వరలో జిల్లాకు జలవనరుల శాఖ మంత్రిని ఆహ్వానించి సాగునీటి ప్రాజెక్టులు త్వరిత గతిన పూర్తి చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. నెల్లూరు, తిరుపతి జిల్లాల జీవనాడి అయిన సోమశిల ప్రాజెక్టును గత ఐదేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఆప్రాన్ కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకం అయిందన్నారు. త్వరలోనే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. మంత్రి పొంగూరు నారాయణ నాయకత్వంలో జిల్లా పరిధిలోని ఎంపీలు,ఎమ్మెల్యేలంతా సమన్వయంతో సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధిని గాడిన పెట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్టు, దుగరాజపట్నం పోర్టు, కిసాన్ సెజ్, కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌లతోపాటు కొత్త పరిశ్రమల స్థాపనపై దృష్టి సారించామని వివరించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకర్ల సురేష్, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నెలవల విజయశ్రీ, పాశం సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడలు ప్రారంభం

నాయుడుపేట, జూలై 6 : ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి 8వ తైక్వాండో క్రీడలు నాయుడుపేట షాదీమందిర్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. క్రీడాకారులకు వెయిన్ పరీక్షలు నిర్వహించారు. రెఫరీలుగా ఉన్న 13 మందికి క్రీడా నియమనిబంధనలను ఏపీ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాల్, ఉమ్మడి నెల్లూరుజిల్లా ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాసులు, కోశాధికారి వి. పవన్ కుమార్ తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్స్ కడపజిల్లా ప్రధాన కార్యదర్శి నాయబ్ రసూల్, అనంతపురం జిల్లా కార్యదర్శి పి. సాయి, కర్నూల్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నజీర్, తదితరులు ఉన్నారు.

మంగళంపాడులో పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, జూలై 6: మండల పరిధిలోని మంగళంపాడులో అధికారులు పర్యటించి రోడ్డు పక్క, పరిసరాల్లో చెత్తను తొలిగించి బ్లీచింగ్ వేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో నిరుపయోగంగా సంపద కేంద్రాలు, రోడ్డుకు పక్కనే చెత్త అనే శీర్షికతో కథనం రావడంతో అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో రవీంద్రకుమార్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఆ గ్రామానికి వెళ్లి సర్పంచ్ రుక్మిణి ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను జేసీబీ సాయంతో తొలిగించారు. డయేరియాపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తడ మండలంలో కూడా డీఎల్‌పీవో వెళ్లి పారిశుధ్య పనులపై ఇన్‌చార్జి ఎంపీడీవో విజయకుమార్ ఆధ్వర్యంలో అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ వేసి పరిసరాల శుభ్రత అవగాహన కల్పించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు వేనాటి రాజారెడ్డి, గాబ్రేలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బీటీఏ సభ్యత్వాలు

కోట, జూలై6: మండల పరిధిలోని సిద్ధవరం, కర్లపూడి, గోవింద పల్లి, ఉత్తమనెల్లూరు గ్రామాల పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులకు శనివారం బీటీఏ సభ్యత్వాలను బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకులు అందజేశారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో బీటీఏ సాధించిన విజయాలు, పోరాడిన ఉద్యమాలపై అవగాహన కల్పించారు. బహుజనుల పక్షాన నిలిచి అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల కోసం పోరాటాలే శరణ్యమని బీటీఏ నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీటీఏ మండల అధ్యక్షుడు నాగరాజు, మట్టిగుంటల శ్రీనివాసులు, బాబురావు, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు ఉన్నారు.

కోట కోర్టులో వేలంపాటలు

కోట, జూలై 6 : కోటలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం విరిగిపడిపోయిన చెట్లకు సంబంధించి వేలంపాటలు జరిగాయి. న్యాయమూర్తి భరత్‌కమల్ ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన వ్యాపారులు ఈ వేలంపాటల్లో పాల్గొన్నారు. గతంలో వచ్చిన మీచౌంగ్ తుఫాన్ కారణంగా కోట కోర్టు ప్రాంగణంలో ఉన్న చెట్లు అన్ని పడిపోయాయి. ఆయా చెట్లను నరికి తరలించుకునేందుకు వేలంపాటలు నిర్వహించారు. రూ.77,500లకు కోట మండలం తిన్నెలపూడికి చెందిన పురిణి శ్రీనివాసులు పాటలో దక్కించుకున్నారు.

టీడీపీ నేత కుటుంబానికి ఆర్థిక సాయం

కోట, జూలై 6 : కోట దళితవాడలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు స్వర్గీయ మర్రి గున్నయ్య కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రూ20 వేల ఆర్థిక సాయం చేశారు. రెండేళ్లక్రితం మర్రి గున్నయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన తల్లిదండ్రులకు ఎంపీటీసీ దారా సురేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు మర్రి అనిల్ చేతులమీదుగా రూ.20 వేలు అందజేశారు.

లెక్కల టీచర్‌పై చర్యలు తీసుకోండి

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు టీఎన్ఎస్ఎఫ్ విజ్ఞప్తి


రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 6: ఏకకాలంలో రెండు వేతనాలు పొందిన లెక్కల మాస్టారు సురేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ కోరింది. టీఎన్ఎస్ఎఫ్ నాయకుల బృందం శనివారం వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ చంద్రయ్యను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్కే నాయుడు మాట్లాడుతూ.. యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న క్యాంపస్ స్కూల్లో టైం స్కేల్ ఉద్యోగిగా ఉంటూనే, తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర రెడ్డికి ఓఎస్డీగా పనిచేస్తూ రెండు వైపులా వేతనం పొందిన సురేష్‌రెడ్డిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

- అలాగే, హైదరాబాదు జేఎన్‌టీయూ నుంచీ డిప్యుటేషన్‌పై ఎస్వీయూకు వచ్చిన ప్రొఫెసర్ అపర్ణపైనా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అంశానికి పాలకమండలి ఆమోదం కూడా లేకపోవడం చట్ట విరుద్ధమని వారు పేర్కొన్నారు.భీష్మ, బషీర్, ఆంజనేయులు, రంగన్న, మల్లి తదితరులు పాల్గొన్నారు.

హంతకులను వెంటనే అరెస్టు చేయాలి

కోట, జూలై 6 : తమిళనాడు రాష్ట్ర బహుజన సమాజ్‌పార్టీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ, బహుజన ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. కోట క్రాస్‌రోడ్డులో శనివారం బీఎస్పీ, బహుజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు నిరసన చేపట్టారు. నిందితులను బహిరంగంగా ఉరితీయాలంటూ నినాదాలు చేశారు. ఒక జాతీయపార్టీ నాయకుడిని పైశాచికంగా హత్యచేస్తే ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు ఊపిరిపోస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ సీనియర్ నాయకులు మీజూరుమాధవ్, కేశవులు, బహుజన ఐక్యవేదిక నాయకులు రంగనాథ్, అశోక్‌కాంబ్లే, సుందరం, పోలయ్య ఉన్నారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం


ప్రణయ్(ఫైల్)

ఓజిలి, జూలై 6: ఓజిలి మండలం పాపిరెడ్డి కండ్రిగ సమీపంలో ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి ప్రణయ్(18)మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... పాపిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన ప్రణయ్ నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ప్రణయ్ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నడిచి వస్తుండగా ఎక్స్‌కవేటర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయప డ్డాడు. స్థానికులు అతడిని హుటాహుటిన నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ప్రణయ్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

కోట, జూలై6 : హెల్మెట్‌ను విధిగా ధరించి ప్రాణాపాయం నుంచి బయటపడాలని ఎస్‌ఐ నాగబాబు కోరారు. మండల పరిధిలోని చిట్టేడు, విద్యానగర్, కోట క్రాస్‌రోడ్డులలో శనివారం హెల్మెట్ ధారణపై వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్రవాహనాలలో ప్రయాణించేటప్పుడు ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోతే రోడ్డు ప్రమాదాల బారిన పడుతామన్నారు. అనంతరం హెల్మెట్ ధారణపై ప్రయోగాత్మకంగా వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

అభివృద్ధికి నోచుకోని వాటర్ ట్యాంకులు


శిథిలావస్థలో వాలాయనందపురం, విఘ్నేశ్వరపురం ట్యాంకులు

గూడూరు, జూలై 6: పట్టణంలో ప్రజలకు తాగునీరు అందించే పలు ఓవర్‌హెడ్ ట్యాంకుల మెట్లు కూలిపోయి దుస్థితికి చేరుకున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో పలు ట్యాంకులు శుభ్రపరిచిన దాఖలు లేకుండా పోయాయయని ప్రజలు వాపోతున్నారు. గూడూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కండలేరు నుంచి వేములపాళెం వాటర్‌వర్క్సుకు నీటిని తరలించి అక్కడ క్లోరినేషన్ చేసిన అనంతరం పట్టణంలో నిర్మించి ఉన్న పది ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తారు. ఈ ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి ప్రజలకు తాగునీటిని పైపులైన్ల ద్వారా అందిస్తుంటారు. ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రపరుస్తారు. పట్టణంలోని పలు నీళ్లట్యాంకులకు నిర్మించిన మెట్లు కూలిపోయి ఉన్నాయి. దీంతో ఐదేళ్లుగా పలు నీళ్లట్యాంకులను శుభ్రపరచడం కానీ, క్లోరినేషన్ చేయడం కానీ జరగడంలేదని ప్రజలు అంటున్నారు. స్థానిక వాలాయనందపురంలో నీళ్లట్యాంకు 8లక్షల లీటర్ల సామర్థ్యం, జనార్థన్‌రెడ్డికాలనీలోని నీళ్లట్యాంకు 5లక్షల లీటర్ల సామర్థ్యం, విఘ్నేశ్వరపురంలోని నీళ్లట్యాంకు 4లక్షల లీటర్ల సామర్థ్యం కలిగివున్నాయి. ఈ మూడు వాటర్ ట్యాంకులకు ఎక్కే మెట్లు కూలిపోయి దుస్థితిలో ఉన్నాయి. అదేవిధంగా జానకిరామ్‌పేటలో 7.50లక్షలు, 2.25లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు నీళ్లట్యాంకులు పక్కపక్కనే ఉన్నాయి. వీటిని శుభ్రపరిచేందుకు మెట్లు బాగున్నా ట్యాంకుకు వెళ్లే ఉమ్మడి ప్లాట్‌ఫాం దెబ్బతినివుంది. వీటి కారణంగా ట్యాంకులను శుభ్రపరచడం లేదని ప్రజలు అంటున్నారు. నిచ్చెన సాయంతోనైనా ట్యాంకులను అప్పుడప్పుడు శుభ్రపరిచి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన గత పాలకులు అసలు పట్టించుకోలేదని ప్రజలు చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీటి సమస్యను పరిష్కరించేలా, నాణ్యమైన నీటిని సరఫరా చేసేలా ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పటిష్ట చర్యలు చేపట్టారు. గతనెలలో తాగునీటి సరఫరా వనరులను స్వయంగా పరిశీలించి దెబ్బతిన్న నీళ్లట్యాంకులను అభివృద్ధిపరిచేలా ప్రణాళికలను రూపొందించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలిచ్చారు. దీంతో ఎమ్మెల్యే చొరవతోనైనా దెబ్బతిన్న నీళ్లట్యాంకులు అభివృద్ధి చెందుతాయని పట్టణ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రగిరి - రేణిగుంట మధ్య సిటీ ఆర్డినరీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), జూలై 6: చంద్రగిరి - రేణిగుంటల మధ్య తిరుపతి కేంద్రంగా రెండు సిటీ ఆర్డినరీ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వినతి మేరకు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి చర్యలు చేపట్టారు. రెండు సిటీ ఆర్డినరీ బస్సులను శుక్రవారం ఉదయం ప్రారంభించి నడుపుతున్నారు. ఉదయం 7గంటలకు డిపో నుంచి బయల్దేరిన బస్సులు ఒకటి రేణిగుంట, మరొకటి చంద్రగిరి బాటపడుతాయి. రేణిగుంట నుంచి తిరుపతి బస్టాండు, అక్కడి నుంచి లీలామహల్, అలిపిరి, రుయా ఆస్పత్రి, టౌన్‌క్లబ్, ఎస్వీయూ మీదుగా చంద్రగిరికి, మళ్లీ అదే దారిలోనే రేణిగుంటకు చేరుకుంటాయి. ఇలా రోజుకు ఆరు ట్రిప్పులు చొప్పున నడుస్తాయి. నూతన బస్సులు రాగానే అధికారికంగా ప్రకటించి ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది. అలాగే పుత్తూరు ఎమ్మెల్యే భానుప్రకాష్ వినతి మేరకు తిరుమణ్యం మీదుగా అప్పలాయగుంట, వెంకటరెడ్డికండ్రిగకు నడిచేలా బస్సుల రాకపోకలను పొడిగించారు. గత వారం రోజులుగా నడుస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని నూతన బస్సులు రాగానే అనుకూలతను పరిశీలించి పల్లెలకు ప్రజారవాణా విస్తరించే చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

శ్రీసిటీ పరిధిలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్యవేడు, జూలై 6: శ్రీసిటీ పరిధిలోని చెరివి, ఇరుగుళం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో మరమ్మత్తుల పనుల కారణంగా ఆదివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల తరువాత సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు. వినియోగదారులు, పరిశ్రమల ప్రతినిధులను సహకరించాలని కోరారు.

ఉపాధి నిధుల వినియోగంలో
అవకతవకలకు పాల్పడితే చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 6: ఉపాధి హామీ నిధుల వినియోగంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ హెచ్చరించారు. శనివారం బుచ్చినాయుడుకండ్రిగలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో రూ.6.39కోట్ల వ్యయంతో 725 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ నిధులకు సంబంధించి వారం రోజులు పాటు 28 పంచాయతీల్లో 15మంది డీఆర్‌పీలు పనులను పరిశీలించి సామాజిక తనిఖీలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ప్రభావతి, ఏఈవో గణేష్, ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఏపీడీ ప్రేమ కుమార్, ఎస్ఆర్‌పీ వెంకయ్య, ఏపీవో భానుప్రియ పాల్గొన్నారు.

రూ.4.50కోట్లతో
సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధి: ఎంపీ


బాధితులను పరామర్శిస్తున్న ఎంపీ గురుమూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 6: సత్యవేడు నియోజకవర్గంలో రూ.4.50 కోట్ల ఎంపీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీ మద్దెల గురుమూర్తి తెలిపారు. మండలంలోని ఆలత్తూరులో టీడీపీ నేతల దాడిలో గాయపడిన వైసీపీ నాయకురాలు చెంచమ్మ కుమార్తెలు విజయ, చంద్రికను నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌తో కలిసి శనివారం పరామర్శించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. నాయకులు కార్యకర్తలు, అధైర్య పడొద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామంలోని అంకాళమ్మను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మీ, వైఎస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి, మణి నాయుడు, అజయ్‌కుమార్ రెడ్డి, గురువయ్య, భాస్కర్‌రెడ్డి, జయచంద్ర నాయుడు, సంజీవయ్య, ప్రసాద్ పాల్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూలై 6 మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు యోగాసన మూర్తి అవతారంలో సింహ వాహనంపై ఊరేగారు. వేకువ జామున స్వామి, అమ్మవార్లను మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తరువాత స్వామి, అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో అలంకరించి సింహ వాహనంపై అధిరోహించి యోగాసన మూర్తి అవతారంలో పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేలా, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్‌పై
చర్యలు తీసుకోండి

ఏర్పేడు, జూలై 6: ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెడీ కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్‌పై చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఎం.అశోక్‌కుమార్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. కాంక్రీట్ మిక్సర్ ప్లాంట్ వల్ల దుమ్ము, ధూళి రేగి ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అంతే కాకుండా ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని జడ్పీటీసీ అన్నారు.

అక్రమ కుళాయి కనెక్షన్లపై ఫిర్యాదు

రేణిగుంట, జూలై 6: రేణిగుంట పంచాయతీలో అక్రమ కుళాయి కనెక్షన్లపై చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి డీఎల్‌పీవో ప్రభురెడ్డికి టీడీపీ వార్డు మెంబర్ ఎంజీ రెడ్డి, టీడీపీ నాయకుడు జగన్ ఫిర్యాదు చేశారు. శనివారం రేణిగుంట పంచాయతీలో పారిశుధ్య పనులు, వాటర్ పంపు హౌస్‌లను స్థానిక ఈవో బాలసుబ్రహ్మణ్యరెడ్డితో కలిసి డీఎల్‌పీవో పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు రేణిగుంట పంచాయతీలో 200 పైచిలుకు 24గంటల కుళాయి కనెక్షన్లు ఇవ్వడంపై ఫిర్యాదు చేశారు. మెయిన్ లైన్ల నుంచి కుళాయి కనెక్షన్లు ఇవ్వడంతో పట్టణంలో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు.

తరగని ఆస్తి విద్య: ఆదిమూలం



పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూలై 6: తల్లిదండ్రులు తమ పిల్లలకు అందించే తరగని ఆస్తి విద్య మాత్రమేనని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. కైలాసనాథ కోనలోని శివశక్తి ఆశ్రమ నిర్వాహకులు, చెన్నైకి చెందిన శ్రీదేవీనాథ మిషన్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు బ్యాగులు, నోటు పుస్తకాలు, ప్లేట్లు, వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని అన్నారు. శనివారం గోవిందప్పనాయుడు కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంఈవో ప్రభాకర్‌రాజు, ట్రస్ట్‌సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీలు

శ్రీకాళహస్తి, జూలై 6: మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాలను శనివారం స్పెషల్ స్క్వాడ్, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. కల్తీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కల్యాణదుర్గం ఏడీఏ కాలప్ప, తిరుపతి జిల్లా ఏడీఏ ధనంజయరెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ జీవ, శ్రీకాళహస్తి ఏడీఏ రమేష్, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, జూలై 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.

ముక్కంటి ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, జూలై 6: ముక్కంటి ఆలయంలో భారీగా ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ పాలనలో ఉద్యోగులు లాబియింగ్‌తో ఏళ్ల తరబడి తమకు అనువైన చోట్ల తిష్టవేశారు. ఉద్యోగ నియామకాలు ఒక విభాగంలో పొందిన వారు సంబంధంలేని మరో విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ముక్కంటి ఆలయం నిత్యం వివాదాలమయంగా సాగింది. ఆలయ ప్రక్షాళనతో అభివృద్ధి బాట పట్టించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అడుగులు వేశారు. వివాదాలకు కేంద్రబిందువుగా ఉన్న కొందరిని గత నెలలో అంతర్గతంగా బదిలీ చేశారు. గత 30న ముక్కంటి ఈవో ఎస్వీ నాగేశ్వరరావు పదవీ విరమణ పొందడంతో ఆయన స్థానంలో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఆలయంలో పరిస్థితులను వారంరోజుల పాటు అధ్యయనం చేశారు. పలు విభాగాలను తనిఖీ చేశారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగుల జాబితా సిద్ధం చేసుకున్నారు. అధికారులు, ఉద్యోగులు కలిపి మొత్తం 32మందిని ఒక విభాగం నుంచి మరో విభాగానికి శనివారం బదిలీ చేశారు. అదేవిధంగా అవుట్ సోర్సింగ్‌లోని 9మంది, కాంట్రాక్టు ప్రాతిపదికన విధులు నిర్వహించే 36మందిని అంతర్గతంగా స్థానచలనం కల్పించారు. ఒకేరోజు 78మందిని అంతర్గతంగా బదిలీ చేయడం పట్ల స్థానికుల్లో హర్షం వ్యక్తమైంది.

ఆ సూపరింటెండెంట్‌కు బదిలీ లేదా..?

ఆలయంలోని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పనిచేసే ఓ సూపరింటెండెంట్‌కు బదిలీ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. వైసీపీ నేతలతో సన్నిహితంగా ఉంటూ గత ఐదేళ్ల నుంచి ఓ సూపరింటెండెంట్ ఎస్టాబ్లిష్ మెంట్ విభాగంలోనే తిష్టవేశాడు. ఈ విభాగం నుంచి వైసీపీ నేతలకు అవసరమయిన అన్ని ఫైళ్లను ఆయన చక్కబెట్టేవారని విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో ఏడాది క్రితం ఆ సూపరింటెండెంట్‌కు ముక్కంటి ఆలయం నుంచి హథీరాంజీ మఠానికి బదిలీ అయింది. కానీ వైసీపీ నేతల అండతో ఆ ఉత్తర్వులను రద్దు చేయించి తిరిగి ముక్కంటి ఆలయంలోనే కొనసాగుతున్నారు. ఎన్నికల కోడ్ సమయంలో ఈ సూపరింటెండెంట్ మరో అధికారితో కలిసి వైసీపీకి అనుకూలమైన 17మంది కార్యకర్తలకు ఒప్పంద ఉద్యోగాల్లో నియమించేందుకు ప్రయత్నించడం తెలిసిందే. కౌంటింగ్‌కు ముందు రోజు ఈ సూపరింటెండెంట్ కొందరు ఉద్యోగలను నియమించేందుకు రహస్యంగా విజయవాడకు ఫైల్‌మూవ్ చేయడంపై పెద్ద ఎత్తున దుమారం రేగింది. ఆ మరుసటి రోజు కూటమి ప్రభుత్వం గెలుపొందడంతో అక్రమ నియామకాలకు అడ్డుకట్ట పడింది. ఆలయమంతా ప్రక్షాళన జరుగుతున్నప్పటికీ వైసీపీతో అంటకాగిన ఆ ఆధికారి యథాస్థానంలో కొనసాగడంపై ఆలయ ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, జూలై 6: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందు కున్నారు. ఉదయం నుంచి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్ర మంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం



శ్రీకాళహస్తి, జూలై 6: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వర స్వామికి శనివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశ పూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించి విశేష పూజలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

ఆర్థిక సాయం

వరదయ్యపాళెం, జూలై 6: మండలంలోని పెద్దపాండూరు పంచాయతీ వెంకటేశ్వర ఎస్టీకాలనీకి చెందిన బుజ్జమ్మ పూడిగుడిసె శుక్రవారం షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన విషయం తెలిసిందే. శనివారం పలువురు దాతలు బుజ్జమ్మకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులను అందజేశారు. టీడీపీ నాయకుడు డాక్టర్ ఎస్.నాగరాజు రూ.3వేలు నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. అదేవిధంగా జనసేన తరపున రూ.4వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. అలాగే అంబేడ్కర్ నేషనల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవం భరణి బాస్ రూ.7,500 విలువ గల నిత్యావసర సరుకులు, వంట సామగ్రి అందజేశారు.

అన్నదానం

శ్రీకాళహస్తి, జూలై 6: పట్టణంలోని పీవీ రోడ్డులో వెలసిన అంకాలమ్మ ఆలయం వద్ద శనివారం అమావాస్యను పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేశారు. గోవర్ధన్‌రావు, యశ్వంత్‌రావు, కాంత్రి కుమార్, శివకుమార్‌రెడ్డి, కృపానిధి, ఉపేందర్‌రెడ్డి, రాఘవేంద్ర, సావిత్రీ బాయి, మాధవ, సాయి, సుశీల, బాబు, వినీత్‌రెడ్డి, నాగేష్, రాజేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

డ్వాక్రా మహిళలకు ఆర్పీ కుచ్చుటోపి

- 13 గ్రూపులకు చెందిన రూ.14.18 లక్షల స్వాహా
- మెప్మా అధికారుల మొద్దునిద్ర
- పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి



పుత్తూరు పోలీసు స్టేషన్ వద్ద బాధిత డ్వాక్రా మహిళలు

పుత్తూరు అర్బన్, జూలై 6:కంచే చేను మేసింది. రూపాయి...రూపాయి కూడబెట్టుకున్న మహిళల నగదును ఆర్పీ గద్దలా తన్నుకుపోయింది. డ్వాక్రా సంఘాలకు, మెప్మాకు మధ్య అనుసంధానకర్తగా ఉండాల్సిన ఆర్పీ (రిసోర్స్ పర్సన్) మహిళల కష్టార్జితాన్ని స్వాహా చేసింది. ఏకంగా రూ.14.18 లక్షల డ్వాక్రా సంఘాల నగదును సొంత అవసరాలకు వాడుకున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉన్నారు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక తీరిగ్గా ఆడిట్ పేరుతో ఏళ్లతరబడి కాలయాపన చేశారు. దీంతో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పును చెల్లించాలని నోటీసులు అందుకున్న మహిళలు లబోదిబోమంటూ శనివారం పోలీసులను ఆశ్రయించారు.

కష్టార్జితం స్వాహా

బాధిత మహిళల కథనం మేరకు.... మున్సిపల్ పరిధిలోని ఆరేటమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీకి చెందిన డ్వాక్రా సంఘాలకు ఆర్పీగా భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారు. 2016-2018 సంవత్సరాల మధ్య డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి చెల్లింపులను తానే స్వయంగా బ్యాంకు వెళ్లి జమచేస్తానని నమ్మబలికి నగదు వసూలు చేశారు. అయితే బ్యాంకులకు చెల్లించకుండా ఆర్పీ భాగ్యలక్ష్మి ఆ నగదును తన సొంత అవసరాలకు వాడుకున్నారు. దీంతో పాటు మిగిలిన కంతులన్నీ ఒకేసారి జమచేస్తే కొత్తగా రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పి రూ.లక్షల్లో వసూలు చేశారు. ఆఖరికి మహిళలు నెలానెలా జమ చేసే పొదుపు నగదును కూడా సంఘాల నుంచి అప్పుగా తీసుకుంది. 2020లో ఆరేటమ్మ కాలనీకి చెందిన నెహ్రూ సంఘానికి మంజూరైన రూ.3 లక్షల శ్రీనిధి సొమ్మును కూడా వాడేసుకోవడంతో ఆ గ్రూప్ సభ్యులు మెప్మా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకి వచ్చింది. దీంతో పలువురు గ్రూప్ సభ్యులు కూడా తమకు జరిగిన అన్యాయంపై వరుసపెట్టి ఫిర్యాదులు చేశారు. దీంతో ఆర్పీ భాగ్యలక్ష్మి పరిధిలో ఉన్న 28 సంఘాల అకౌంట్లకు ఆడిట్ నిర్వహించారు. ఈ తంతు ఏడాది పాటు సాగింది. చివరగా మొత్తం 13 సంఘాలకు చెందిన రూ.14.18 లక్షల నగదు స్వాహా చేసినట్లు తేలింది. దీంతో గత ఏడాది ఆర్పీ భాగ్యలక్ష్మిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. అయితే ఆమె స్వాహా చేసిన నగదును తిరిగి రాబట్టడంలో మాత్రం మెప్మా అధికారులు విఫలమయ్యారు. ఇటీవల బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించాలని నోటీసులు వస్తుండడంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని శనివారం పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లోపభూయిష్టం మెప్మా పనితీరు

ఒక ఆర్పీ డ్వాక్రా సంఘాల నగదును రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉండడంపై తీవ్రస్థాయిలో విమర్శలు తలెత్తు తున్నాయి. నాలుగేళ్ల క్రితమే బయటపడినా సమస్యను మసిపూసి మారేడుకాయ చేయాలనే ప్రయత్నం చేశారు తప్ప తమకు న్యాయం చేయాలనే ఆలోచన మెప్మా అధికారులకు లేకుండాపోయిందని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినా మెప్మా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ నగదును తిరిగి ఇప్పించడంతో మెప్మాతో పాటు మున్సిపల్ అధికారులు కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి


జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, జూలై 6: మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆయన ఆయన చిత్రపటానికి టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు నివాళులర్పించారు. శనివారం పట్టణంలోని ఎంబీ రోడ్డులో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, బాలాజీనాయుడు, దాసరి విజయ్‌చౌదరి, ధనపాల్, గాలి సుబ్రహ్మణ్యం నాయుడు, అజయ్‌చౌదరి, చంద్రాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు ఎంపీడీవోగా ఇందిరమ్మ



పుత్తూరు టౌన్, జూలై 6: పుత్తూరు ఎంపీడీవోగా ఇందిరమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడే పనిచేస్తున్న ఆమె సెలవుపై వెళ్లారు. సెలవు ముగి యడంతో శనివారం మళ్లీ బాధ్యతలు తీసుకున్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూలై 6: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేద మంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీదుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళహారుతలిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు

పుత్తూరు అర్బన్, జూలై 6: మున్సిపల్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు టాటా ట్రస్ట్, ఐసీడీఎస్ సంయుక్తంగా పాత మున్సిపల్ కార్యాలయ ఆవ రణలో మెడికల్ క్యాంపు శనివారం నిర్వహించారు. గర్భసంచి, రొమ్ము క్యాన్సర్, నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించి స్క్రీనింగ్ టెస్ట్‌లు నిర్వహించారు. సీడీపీవో పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, అనిత, సంధ్య, డాక్టర్లు వెంకయ్య బాబు, హేమంత్‌కుమార్‌రెడ్డి, కుమారి, మెహతాజ్, వినీత పాల్గొన్నారు.